PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
# ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 66 | విజయవాడ, శుక్రవారం 6 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Friday 6 October 2023 | Rs

## ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వండి

- ఢిల్లీ పోలీసులకు కోర్టు ఆదేశం
- విచారణకు రావాలని సీనియర్ జర్నలిస్టులకు మళ్లీ సమన్లు జారీ

లోపలి పేజీలో..

## న్యూజిలాండ్ బోణి



- ప్రారంభ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై 9వికెట్ల తేడాతో గెలుపు
- కాన్వే, రవీంద్ర శతకాలు
- ఐసిసి వన్డే ప్రపంచకప్

6

# బిజెపి ఓటమితోనే దేశానికి రక్ష



### స్టీల్‌ప్లాంట్ రక్షణ పోరాటానికి 'ఇండియా'ను సిద్ధం చేస్తాం
### సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి
### విశాఖలో ఉక్కు రక్షణ సభకు వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు



విశాఖ సభకు వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకం, ఇన్‌సెట్‌లో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి

**ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో**

దేశ ప్రజల సంపదైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలంటే కేంద్రంలో బిజెపిని 2024 ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. అప్పుడే రాజ్యాంగాన్ని కాపాడుకుని మతోన్మాదులను తరిమికొట్టిన వాళ్లమవుతామన్నారు. గురువారం సాయంత్రం కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద సిపిఎం ఆధ్వర్యాన జరిగిన 'ఉక్కు రక్షణ బహిరంగ సభ'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో బిజెపికి వ్యతిరేకంగా ఏర్పడిన 'ఇండియా' వేదికలో పార్టీలను పోరుకు తాను సిద్ధం చేస్తానని ఆయన ప్రకటించగానే సభకు హాజరైన వేలాది మంది ప్రజలు హర్షధ్వానాలు చేశారు. ఇండియా వేదికలోగల పార్టీలు ఇప్పటికే దేశ సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడతామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. వ్యవసాయ రంగంలో లక్షల మందికి నష్టం చేకూర్చే విధానాలపై రైతులు పోరాడిన తీరుతో మోడీ తన జీవితంలో ఒకసారి వెనకడుగు వేశాడని పేర్కొంటూ, ఢిల్లీ రైతాంగ ఉద్యమాన్ని ఉటంకించారు. ఆ పోరాట స్ఫూర్తితో ఉక్కు రక్షణకు కార్మికవర్గం మరింత గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలకు ప్రజలు యజమానులని, పాలకులు మేనేజర్లు మాత్రమేనని, యజమానులకు తెలియకుండా మేనేజర్లు ఎలా అమ్ముతారు? వారికి అమ్మే అర్హత ఎక్కడిది? అని ఏచూరి అనగానే సభలో చప్పట్ల వర్షం కురిసింది. దేశ సహజ వనరులు, సంపదలను విదేశాలకు దాసోహం చేసేలా మోడీ విధానం ఉందన్నారు. 1947 తర్వాత ఇంత పెద్ద ఎత్తున నిరుద్యోగం ఏ సంవత్సరమూ లేదని వివరించారు. 22 నెలలుగా ధరలు ఆకాశాన్నంటుతున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన జి-20 సమావేశాలకు రూ.4,100 కోట్లను మోడీ ఖర్చు చేశారన్నారు. తొమ్మిదేళ్లలో మోడీ దేశంలో పెట్టుబడిదారులకు రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారని, స్టీల్‌ప్లాంట్‌కుగల చిన్న నష్టాన్ని ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. దేశంలో బిజెపి మతోన్మాద దాడులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పురాణాల్లో క్షీరసాగర మథనం జరిగిన వైనాన్ని వివరిస్తూ, చెడ్డవారి చేతుల్లో నేడు అమృతం ఉందని, ప్రజల చేతుల్లోకి దాన్ని తేవాల్సి ఉందని అన్నారు.

మిగతా 2లో



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన జగన్

# నిధులు ఇవ్వండి

- కేంద్ర మంత్రులకు ముఖ్యమంత్రి జగన్ వినతి
- నేడు అమిత్‌షాతో భేటీ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రానికి రావాల్సిన నిధులు, బకాయిలను వెంటనే ఇప్పించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌కె సింగ్‌ను కోరారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం ఇద్దరు మంత్రులనూ సిఎం వేర్వేరుగా కలిశారు. శుక్రవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలవనున్నారు. అలాగే వామపక్ష ఉగ్రవాదంపై జరిగే సదస్సులో పాల్గొననున్నారు. గురువారం పర్యటనలో భాగంగా ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా పోలవరం. వెనుకబడిన ప్రాంతాల నిధుల అంశాన్ని ప్రస్తావించారు. దీంతోపాటు ఆర్థిక సంఘం నిధులను కూడా కోరినట్లు తెలిసింది. అలాగే ఆర్‌కెసింగ్‌తోనూ కనీసం గంటపాటు చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణా నుండి రావాల్సిన విద్యుత్ బకాయిలు, కేంద్ర విద్యుత్ ప్రాజెక్టుల నుండి సరఫరా తదితర అంశాలపైనా చర్చించినట్లు తెలిసింది.

తెలంగాణా నుండి రావాల్సిన బకాయిలు విడుదల చేయడం లేదని, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటిని ఇప్పించడం ద్వారా విద్యుత్ సంస్థలను ఆదుకున్నట్లు అవుతుందని విన్నవించినట్లు తెలిసింది. దీంతోపాటు ఎపిలో విద్యుత్ ఉత్పత్తికోసం చేపడుతున్న అనేక ప్రాజెక్టులపైనా సిఎం కేంద్రమంత్రికి వివరించినట్లు తెలిసింది. ఆర్‌డిఎస్ రీవ్యాంప్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ కింద రాష్ట్రానికి నిధులు ఇస్తామని కేంద్రమంత్రి సిఎంకు చెప్పినట్లు తెలిసింది. సిఎం వెంట వైసిపి పార్లమెంటరీపక్ష నాయకులు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, సిఎస్ జవహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## భారత్‌లో పెరిగిన కుబేరులు

- ఫోర్బ్స్-2023 సంపన్నుల జాబితా వెల్లడి
- దేశంలో 169 మంది బిలియనీర్లు

లోపలి పేజీలో..

## నార్వే రచయిత జాన్ ఫోసెకు నోబెల్ సాహిత్య పురస్కారం



**స్టాక్‌హోం :** ఈ ఏడాది నార్వే రచయిత జాన్ ఫోసెను నోబెల్ సాహిత్య పురస్కారం వరించింది. మాటల్లో చెప్పలేని వాటికి గళాన్ని అందించేలా ఆయన రచించిన వినూత్న నాటకాలు, గద్యాలకు గాను ఈ బహుమతిని అందజేస్తున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ గురువారం ప్రకటించింది. నార్వే పశ్చిమ తీరంలో 1959లో జన్మించిన ఫోసెకు చిన్న నాటి నుంచే రచనా వ్యాసంగం పట్ల ఆసక్తి వుంది. నాటకాలు, నవలలు, పద్యాలు, వ్యాసాలు, పిల్లల పుస్తకాలు, అనువాదాలు, సంకలనాలు ఇలా అన్ని రకాల సృజనాత్మక వ్యాసంగాన్ని ఆయన కొనసాగించారు. 'ఫోసె మినిమలిజం'గా పిలవబడే రచనా శైలిలో ఆయన రచనలు వుంటాయి. 2018లో లైంగిక ఆరోపణలు స్వీడిష్ అకాడమీని వెల్లువెత్తడంతో ఆ ఏడాది అవార్డును వాయిదా వేశారు. తర్వాత అకాడమీని పునర్వ్యవస్థీకరించారు. 2019లో ఆస్ట్రియాకు చెందిన పీటర్ హ్యాండ్కేకు సాహిత్య అవార్డును ఇచ్చినందుకుగాను మరిన్ని విమర్శలను ఎదుర్కొంది.

# బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ హటావో

- ఢిల్లీలో కదంతొక్కిన మహిళా లోకం
- మహిళా రిజర్వేషన్ చట్టం ఎప్పటికి అమలుకు వస్తుందో
- ఐద్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీమతి టీచర్, మరియం ధావలే



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

**ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో**

మహిళా వ్యతిరేకి బిజెపిని గద్దెదించాల్సిందేనంటూ దేశ రాజధాని ఢిల్లీలో వేలాది మంది మహిళలు గురువారం కదంతొక్కారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన గురువారం జంతర్ మంతర్లో నిర్వహించిన "చలో ఢిల్లీ" ర్యాలీకి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ నలుమూలలకు చెందిన వేలాదిమంది మహిళలు హాజరయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి పాలన నుంచి మహిళలను, దేశాన్ని రక్షించాలని ఈ ర్యాలీనుద్దేశించి మాట్లాడిన వక్తలు పిలుపునిచ్చారు. బిజెపి - ఆర్‌ఎస్‌ఎస్ పాలనలోని మహిళా వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను బట్టబయలు చేస్తూ మూడు నెలల దేశవ్యాప్త ప్రచారం తరువాత మహిళలు రాజధానికి చేరుకున్నారు. జంతర్ మంతర్ వద్ద బహిరంగ సభకు ముందు దేశ రాజధానిలోని వివిధ ప్రదేశాల నుంచి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీలు చేపట్టారు. ప్లకార్డులు చేబూని మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు.

ర్యాలీలో ఐద్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పికె శ్రీమతి టీచర్, మరియం ధావలే మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ చట్టంతో మహిళలను మరోసారి మోసం చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టం ఎప్పటికి అమలులోకి వస్తుందో తెలియదని అన్నారు. 2014లో మహిళలను ఆకట్టుకునే వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన బిజెపి ఆ తరువాత వాటిని పూర్తిగా గాలికొదిలేసిందని అన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఆకలి, హింసకు మహిళలే ఎక్కువగా బాధితులని తెలిపారు. వంట గ్యాస్ ధర పెంచి మహిళలకు బిజెపి మరిన్ని కష్టాలను తెచ్చి పెట్టిందని విమర్శించారు. మహిళలపై హింస, దాడులు పెరుగుతున్నాయని, ఎన్‌సిఆర్‌బి రిపోర్టులు కూడా దీనినే ధ్రువీకరిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రంలో, వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బిజెపి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మహిళలపై అవమానకరమైన, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, అయినా, వారిపై చర్యలు లేవని అన్నారు. మహిళలను వంటింటికే పరిమితం చేసే, వారిని రెండో తరగతి పౌరులుగా పరిగణించే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతమైన మనువాదాన్ని ఓడించాలని అన్నారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మానవ హక్కులను కాలరాస్తోందన్నారు. దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రమాదంలో పడిందనడానికి న్యూస్‌క్లిక్‌పై తాజాగా జరిగిన దాడులే ఒక నిదర్శనమన్నారు. క్రూరమైన ఉపా చట్టం కింద అరెస్టు చేసిన న్యూస్‌క్లిక్ జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్

మిగతా 5లో

## ఇంటర్ ఫెయిల్ విద్యార్థుల ఫీజు గడువు పొడిగింపు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**


ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థుల కోసం పరీక్ష ఫీజు చెల్లించే తేదీ గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఈ మేరకు బోర్డు కార్యదర్శి సౌరబ్ గౌర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చిలో జరగనున్న పరీక్షలకు సెప్టెంబరు 30లోపు ఫీజు చెల్లించాలని గతంలో వెల్లడించారు. ఇప్పుడు నవంబరు 30 వరకు ఫీజు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. ఫెయిలైన, డ్రాపవుట్ అయిన జనరల్, వొకేషన్ కోర్సుల విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా చెల్లించాలని వివరించారు. ప్రథమ, లేదా ద్వితీయ సంవత్సరం జనరల్, వొకేషషన్ కోర్సుల విద్యార్థులు థియరీ పేపర్లకు రూ.550, ప్రాక్టికల్ పరీక్షలకు రూ.250, పరీక్ష ఫీజు కింద రూ.150 చెల్లించాలన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెండు సబ్జెక్టులకు హాజరయ్యే విద్యార్థులు రూ.1100, ప్రాక్టికల్ పరీక్షలకు రూ.500, పరీక్ష ఫీజు కింద రూ.300 చెల్లించాలని తెలిపారు. ఫెయిలైన విద్యార్థి అడ్మిషన్ పొంది అన్ని పరీక్షలకూ హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన దానిని పరిగణనలోకి తీసుకుంటామని ప్రకటించారు. కంపార్ట్‌మెంటల్, ఫెయిల్ అని కాకుండా ఒకేసారి ఉత్తీర్ణులయ్యారని సర్టిఫికెట్ జారీ చేస్తామని పేర్కొన్నారు. తిరిగి అడ్మిషన్ పొందిన విద్యార్థులకు జగనన్న అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద వంటి వాటికి అర్హులేనని వివరించారు.

## చంద్రబాబుకు 19 వరకు రిమాండ్

- సెంట్రల్ జైలు నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరు
- కస్టడీ, బెయిల్ పిటీషన్లపై విచారణ నేటికి వాయిదా

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, అమరావతి బ్యూరో**

స్కిల్ స్కామ్‌లో నిందితునిగా ఉన్న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు ఎసిబి కోర్టు ఈ నెల 19 వరకూ రిమాండ్‌ను పొడిగించింది. కస్టడి, బెయిల్ పిటిషన్లపై విచారణను నేటికి వాయిదా వేసింది. ఇరువురి వాదనను శుక్రవారం వింటానని న్యాయమూర్తి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన్ని గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ఎదుట హాజరుపర్చారు. చంద్రబాబు తరుపున సీనియర్ లాయర్ ప్రమోద్ కుమార్ దూబె వాదనలు వినిపించారు.సాంకేతికంగా చంద్రబాబుకు ఈ కేసుతో ఎటువంటి సంబంధమూ లేదని వివరించారు. స్కిల్ కార్పొరేషన్‌కు ఇచ్చిన బ్యాంకు గ్యారంటీలు ఏమిటని? న్యాయమూర్తి ప్రశ్నించారు. స్కిల్ ప్రాజెక్టు ఆమోదం తెలపడంతోనే



సిఎంగా చంద్రబాబుపాత్ర పూర్తయిందని దూబె సమాధానం ఇచ్చారు. సీమెన్స్‌తో ఒప్పందం చేసుకుంది స్కిల్ కార్పొరేషనే తప్ప ప్రభుత్వం కాదని, స్కిల్ కార్పొరేషన్, సీమెన్స్ ఇండియా, డిజైన్ టెక్ సంస్థల మధ్య ఒప్పందం కుదిరిందని, అక్కడ అవినీతి అక్రమాలు జరిగితే చంద్రబాబుకు సంబంధం ఎలా ఉంటుదని న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబె ప్రశ్నించారు. ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ సిఐడి తరుపున వాదనలు వినిపించారు. స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలకు సంబంధించి కీలక డాక్యుమెంట్లను కోర్టుకు సమర్పించారు. డొల్ల కంపెనీల నుంచి నిధులు నేరుగా టిడిపి ఖాతాలోకి వచ్చాయన్న ఆధారాలను వివరించారు. రూ.27 కోట్లు మళ్లించిన బ్యాంకు ఖాతాల డాక్యుమెంట్లని ఎసిబి కోర్టుకు సమర్పించారు. దీనికి సంబంధించిన ఆడిటర్ ఈ నెల 10న విచారణకు హాజరవుతున్నట్లు తెలిపారు. స్కిల్ కుంభకోణంలోచంద్రబాబు పాత్రపై ఆధారాలున్నాయని, కస్టడీకి ఇస్తే కేసుకు సంబంధించి లోతైన విచారణ జరుగుతుందని కోరారు. బెయిల్ మంజూరు చేయొద్దని అదనపు అడ్వకేట్ జనరల్ కోర్టును కోరారు. ఈ నేపథ్యంలో రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## 12న తెలంగాణ ఎన్నికల షెడ్యూల్?

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**




త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, మిజోరాం రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ ఈనెల 12న వెలువడనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల సన్నాహాలు దాదాపుగా పూర్తయ్యాయి. క్షేత్ర స్థాయిలో కేంద్ర ఎన్నికల సంఘం సమీక్షలు కూడా చివరిదశకు వచ్చాయి. ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో పర్యటించి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ బృందం చివరిగా తెలంగాణలో పర్యటించింది. రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో అన్ని అంశాలపై ఇసి చర్చించింది. పోలింగ్‌కు ముందు కసరత్తు అతిత్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను సిఇసి రాజీవ్ కుమార్ ఆదేశించారు. రేపు ఢిల్లీలో జరిగే సిఇసి సమావేశంలో ఐదు రాష్ట్రాల్లో పరిస్థితులపై మరోసారి చర్చించనున్నారు.

## కడపలో హెడ్ కానిస్టేబుల్ దారుణం

- భార్యా పిల్లలను తుపాకీతో కాల్చి చంపి తానూ ఆత్మహత్య

**ప్రజాశక్తి- కడప అర్బన్**

కడపలో దారుణం చోటుచేసుకుంది. ఒక హెడ్ కానిస్టేబుల్ తన భార్య, పిల్లలను హత్య చేయడమే కాకుండా తానూ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది ఇందుకు సంబంధించి మీడియాకు డిఎస్‌పి షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం... వైఎస్‌ఆర్ జిల్లా పులివెందులకు చెందిన వెంకటేశ్వర్లు (55) కడపలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా రెండేళ్లుగా పనిచేస్తున్నారు. కస్టోడియన్‌గా, రైటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలో నివాసం ఉంటున్నారు. కస్టోడియన్ ఆధీనంలో పోలీసుల రివాల్వర్లు, తుపాకీలు ఉంటాయి. విధి నిర్వహణ అనంతరం బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో పోలీస్ స్టేషన్ నుంచి వెంకటేశ్వరరావు ఇంటికి చేరుకున్నారు. తన ఆధీనంలోని ఉన్న ఒక రివాల్వర్‌ను తనతో తీసుకెళ్లారు. ఇంట్లో నిద్రిస్తున్న తన భార్య మాధవీలత (50), కుమార్తెలు లికిన్య (21), అభిజ్ఞ (16)లను ఆ రివాల్వర్‌తో కాల్చి చంపారు. ఆ తర్వాత అదే రివాల్వర్‌తో తానూ ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి ముందు ఆయన సూసైడ్ నోట్ రాశారు. తనకు రెండో భార్య ఉందని, ఆమెకు, ఆమె కుమారుడికి తన బెనిఫిట్స్ చెందించాలని ఈ నోట్‌లో రాసి ఉంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు.



వెంకటేశ్వర్లు, మాధవీలత ( ఫైల్ )

**కారణాలు వెలికితీస్తాం : ఎస్‌పి**

ఈ ఘటనకు కారణాలను పోలీస్ విచారణలో వెలికితీస్తామని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. రిమ్స్ మార్చురీలో మృతదేహాలను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో ఎస్‌పి మాట్లాడుతూ ఈ ఘటనకు కారణాలేమిటనేది విచారణ చేస్తామని చెప్పారు.

**బాధాకరం : డిప్యూటీ సిఎం**

ఈ ఘటన చాలా బాధాకరమని డిప్యూటీ సిఎం అంజాద్‌బాష అన్నారు. మేయర్ సురేష్‌బాబుతో కలిసి ఆయన ఘటన స్థలాన్ని పరిశీలించారు. బొట్టు స్వామిగా పిలుచుకునే వెంకటేశ్వర్లు చాలా మంచివారని, కుటుంబం మొత్తం ఇలా బలికావడం బాధాకరమని వారు పేర్కొన్నారు.

## జర్నలిస్టుల అరెస్టు అప్రజాస్వామికం

- సాహితీ స్రవంతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఢిల్లీలో న్యూస్ క్లిక్ కార్యాలయంపై దాడి చేసి ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్ఆర్ అధిపతి అమిత్ చక్రవర్తిని అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, ప్రధాన కార్యదర్శి కె సత్యరంజన్ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా ఉన్న పత్రిక సంపాదకులను ఉగ్రవాద నిరోధక చట్టం కింద అరెస్టు చేయడాన్ని ఖండించారు. మీడియాపై దాడి చేయడమంటే భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి చేయడమే అని అన్నారు. పత్రికలను, మీడియాను తమ గుప్పెట్లో పెట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు.

## నేడు చంద్రబాబుతో లోకేష్ ములాఖత్

ప్రజాశక్తి - విజయవాడ

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టయిన నేపథ్యంలో న్యాయనిపుణులతో చర్చించేందుకు ఢిల్లీకి వెళ్లిన ఆయన కుమారుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గురువారం రాత్రి గన్నవరం వచ్చారు. అక్కడి నుంచి నేరుగా ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు. శుక్రవారం చంద్రబాబుతో ములాఖత్ కానున్నారు. కేసులకు సంబంధించి సుప్రీం కోర్టు న్యాయవాదులతో జరిగిన చర్చలపై చంద్రబాబుకు వివరించనున్నట్టు సమాచారం.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## పరాకాష్టకు టిడిపి నేతల వికృత చేష్టలు

- వైసిపి అధికార ప్రతినిధి నారమల్లి పద్మజ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మంత్రి రోజాపై టిడిపి నేతల వికృత చేష్టలు పరాకాష్టకు చేరాయని, అసభ్య ట్రోల్స్‌పై నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి స్పందించాలని వైసిపి అధికార ప్రతినిధి నారమల్లి పద్మజ డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు జైలులో ఉండటం తట్టుకోలేక టిడిపి నేతలు అనైతికంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రోజాపై దిగజారుడు మాటలను మానుకోకపోతే ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని అన్నారు.

## టిడిపి-జనసేన కలయిక వ్యాక్సిన్ కాదు వైరస్

- మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



టిడిపి-జనసేన కలిస్తే రాష్ట్రానికి వ్యాక్సిన్‌లాంటిదని పవన్‌కల్యాణ్ అంటున్నారని ఆచరణలో ఆ కలయిక వ్యాక్సిన్ కాదని వైరస్ అని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ సభలకు ప్రజలు రావడం లేదన్నారు. రెండు వేలమందితో కూడా సభ పెట్టుకోలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. అవనిగడ్డలో ఫ్లాప్ షో నిర్వహించారని అన్నారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు కలయిక విషంతో సమానమన్నారు.

# ప్రజాస్వామ్యానికి ముప్పు

## న్యూస్‌క్లిక్‌పై దాడికి నిరసనలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పత్రికాస్వేచ్ఛపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడులతో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతోందని పలువురు పాత్రికేయులు, మేధావులు, ప్రజాసంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. స్వతంత్ర వార్తా పోర్టల్ న్యూస్‌క్లిక్‌పై కేంద్ర ప్రభుత్వం దాడి చేసి, ఆ సంస్థ ఎడిటర్‌ను అరెస్ట్ చేయడానికి నిరసనగా విజయవాడ లెనిన్ సెంటర్లో గురువారం ధర్నా జరిగింది.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాసు మాట్లాడుతూ ప్రజాతంత్ర పద్ధతుల్లో నడుస్తున్న మీడియా సంస్థల గొంతు నొక్కడమే పనిగా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను న్యూస్‌క్లిక్ ఎప్పటికప్పుడు బయటపెడుతోందని, దీనిని సహించలేకే అసత్య ఆరోపణలు చేసి దాడులకు దిగడంతో పాటు, సంస్థ ఎడిటర్‌ను అరెస్ట్ చేసిందన్నారు. న్యూయార్క్‌టైమ్స్ పేపర్లో వచ్చిన కథనం ఆధారంగా అరెస్టు చేశామని ప్రభుత్వం చెబుతుండగా, అమెరికా రక్షణ మంత్రి మాత్రం న్యూయార్క్‌టైమ్స్ కథనంలోని ఖచ్చితత్వాన్ని తాము గుర్తించబోమని అన్నారని తెలిపారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాలను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. పత్రికలతో చెలగాటమాడిన ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదని చెప్పారు. ఎపియుడబ్ల్యుజె ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ మాట్లాడుతూ న్యూస్‌క్లిక్‌పై దాడి ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడని అన్నారు. తమకు అనుకూలంగా లేని పత్రికలపైనా, వ్యవస్థలపైనా కేంద్రం పదే పదే దాడులు చేయిస్తోందని విమర్శించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకురాలు శాంతిశ్రీ మాట్లాడుతూ వాస్తవాలు వెలుగులోకి తెస్తున్నందుకే ఈ దాడి జరిగిందన్నారు. దీనికి ప్రతిఒక్కరు ఖండించడంతో పాటు, ప్రజాస్వామ్య పరిరక్షణకు జరుగుతున్న పోరాటాల్లో కలిసిరావాలని కోరారు. ఎపి ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యమని ప్రధాని చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలని అన్నారు. సంగమం నాయకులు దివి కుమార్ మాట్లాడుతూ ఎపి, తెలంగాణాలో 68 ప్రాంతాల్లో అనేక సంస్థలు, సంఘాలు, వ్యక్తులపై ఎన్ఐఎ చేసిన దాడులను ప్రస్తావించారు. చట్టబద్ధమైన పద్ధతుల్లో వ్యవహరిస్తున్నా ఏదో ఒక రూపంలో కేసులు పెట్టి వేధిస్తున్నారని, వీటిని ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలన్నారు.




విజయవాడ లెనిన్ సెంటర్లో జరిగిన ధర్నాలో పాల్గొన్న పాత్రికేయులు

ఎపిజెఎఫ్ నాయకులు వీర్ల శ్రీరాం యాదవ్ మాట్లాడుతూ పత్రికల మీద దాడులు సాగించిన ప్రభుత్వాలు ఏవీ మనుగడ సాగించలేదని అన్నారు. ఎపి మీడియా ఫెడరేషన్ నాయకులు వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ కేంద్రం పోకడలను చూస్తూ ఊరుకుంటే మనుగడ ప్రశ్నార్ధకమవుతుందన్నారు. విరసం అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ మోడీ వ్యతిరేకులు దేశంలో లేకుండా చేయాలనే కుట్రలో భాగంగానే ఇలాంటి చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. జెవివి నాయకులు మురళీధర్ మాట్లాడుతూ కేంద్రం తీరువల్ల ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు ఏర్పడుతుందని అన్నారు. ఐఎఫ్‌టియు నాయకులు ప్రసాదు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రజాతంత్ర మీడియా మధ్య యుద్ధం జరుగుతోందని, ఇందులో ప్రజాస్వామ్యవాదులందరూ ప్రజాతంత్ర మీడియాను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పౌర సంక్షేమ సంఘాల నాయకులు సత్యబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీడియాను టార్గెట్ చేశాయన్నారు. . ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు నాయకులు పద్మ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వసంత్, ఎపియుడబ్ల్యుజె నగర అధ్యక్ష కార్యదర్శులు రాజేశ్వరరావు, చావా రవి, దారం వెంకటేశ్వరరావు, నాగరాజు, ఎఐవైఎఫ్ నాయకులు మోతుకూరి అరుణ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు సాయి, భారత్ బచావో నాయకులు భాస్కరరావు, రంగారెడ్డి, సాహితీ స్రవంతి నాయకులు సత్యాజీ, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి కార్యదర్శి చంద్రానాయక్, ఎపిడబ్ల్యుజెఎఫ్ సీనియర్ నాయకులు వలీ, గోరంట్లప్ప ఎపిపిజెఎ నాయకులు ఆనంద్ పాల్గొన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు కలిమిశ్రీ, ఎం.బి.నాథన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా సీనియర్ జర్నలిస్టు వల్లభనేని సురేష్ వందన సమర్పణ చేశారు.

## 9న వైసిపి విస్తృతస్థాయి సమావేశం !

- హాజరుకానున్న సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి విస్తృతస్థాయి సమావేశం ఈ నెల 9న జరగనుంది. ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్‌ల ఛైర్మన్లు, వైసిపి రాష్ట్ర నాయకత్వంతోపాటు జిల్లాల అధ్యక్షులను ఈ సమావేశానికి ఆహ్వానించినట్లు సమాచారం. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కడ్నుంచే ఈ నెల 9న జరిగే సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని పార్టీ శ్రేణులకు పంపినట్లు తెలిసింది. ఇటీవల అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా సెప్టెంబరు 26న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లాల అధ్యక్షులతో సమీక్షించిన జగన్... ఇప్పుడు మరోసారి విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది. బిజెపి కలిసొచ్చినా.. రాకపోయినా టిడిపితో ఎన్నికలకు పోతామని జనసేన చేసిన ప్రకటన, చంద్రబాబు అరెస్టు తర్వాత రాష్ట్రంలో టిడిపి చేపట్టిన ఆందోళన కార్యక్రమాల నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది.

## ఎస్ఐ మెయిన్స్‌కు 31,193 మంది అభ్యర్థులు

- 14, 15 తేదీల్లో పరీక్షలు
- ఎస్ఎల్‌పిఆర్‌బి ఛైర్మన్‌అతుల్ సింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సివిల్, ఎపిఎస్‌పి సబ్ ఇన్‌స్పెక్టరు పోస్టుల రిక్రూట్‌మెంటుకు సంబంధించి తుది పరీక్షలకు మొత్తం 31,193 మంది అభ్యర్థులు క్వాలిఫై అయినట్లు స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంటు బోర్డు ఛైర్మన్ అతుల్‌సింగ్ తెలిపారు. క్వాలిఫై అయిన వారికి ఈ నెల 14, 15 తేదీల్లో కర్నూలు, విశాఖపట్నం, గుంటూరు, ఏలూరు కేంద్రాల్లో తుది మెయిన్స్ పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 25 వరకు అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించామన్నారు .ఇందులో పురుషులు 27,590 మంది, మహిళలు 3,603 మంది క్వాలిఫై అయ్యారని తెలిపారు. వీరికి నాలుగు పేపర్లతో 14, 15 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 14న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేపర్ 1 పరీక్ష వుంటుందని, అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు పేపర్-2 వుంటుందని తెలిపారు. 15న ఉదయం పేపర్-3 వుంటే, సాయంత్రం పేపర్-4 వుంటుందన్నారు. క్వాలిఫై అభ్యర్థులు శుక్రవారం నుంచి ఈ నెల 12 వరకు వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఏదైనా సమస్య వుంటే 9441450639, 9100203323 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

# అరటి ధర నేలచూపులు

- వినాయకచవితి అనంతరం ఇదే పరిస్థితి
- నష్టాలు చవిచూస్తున్న రైతులు



రాజమండ్రి మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన అరటి గెలలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అరటి ధరలు ప్రస్తుతం నేలచూపులు చూస్తున్నాయి. కొన్ని పండగలకు ఊరిస్తూ.... మరికొన్ని పండగలకు ఉసూరుమనిపిస్తున్నాయి. శ్రావణమాసంలో కర్పూర రకం అరటి గెల రూ.400 నుంచి రూ.600 వరకూ అమ్ముడుపోయింది. వినాయకచవితికి ఈ ధర రూ.400 పరిమితం కాగా, ప్రస్తుతం రూ.200 నుంచి రూ.250కి మించిలేదు. చక్రకేళి రకం గెల గత నెలలో రూ.550 ఉండేది. ప్రస్తుతం రూ.350కు ధర పతనమైంది. అమృతపాణి రకం గెల రూ.350 నుంచి రూ.250కు దిగజారింది. నెల వ్యవధిలో ధరలు పడిపోవడంతో ఎకరా ఒక్కంటికీ రూ.50వేల వరకూ నష్టం వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**'తూర్పు', కోనసీమ జిల్లాల్లో విస్తారంగా సాగు**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, అంబాజీపేట మండలాల్లో విస్తారంగా అరటి సాగవుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, తాళ్లపూడి మండలాల్లో ఈ పంటను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ రెండు జిల్లాల్లోని మరో ఎనిమిది మండలాల్లో అక్కడక్కడా అరటి సాగులో ఉంది. అధికారిక గణాంకాల ప్రకారం ఈ రెండు జిల్లాల్లో సుమారు 45 వేల ఎకరాల్లో అరటిని సాగు చేస్తున్నారు. సుమారు ఎనిమిది లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అరటి పంటపై ఆధారపడి 25 వేల మంది రైతులు, వ్యాపారులు, మూడు వేల మంది కార్మికులు జీవిస్తున్నారు. ప్రధానంగా కర్పూరం, తెల్ల చక్రకేళి, బుసావళి ఎర్ర చక్రకేళి తదితర రకాల అరటిని రైతులు సాగు చేస్తున్నారు. రకాన్ని బట్టి వీటి సాగు, రవాణాకు ఎకరా ఒక్కంటికీ రూ.70 వేలు నుంచి రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడి అవుతోంది. గెల రూ.500 నుంచి రూ.700 పలికితేనే తమకు గిట్టుబాటు అవుతుందని, లేకుంటే పెట్టుబడి ఖర్చులు కూడా రావని రైతులు చెబుతున్నారు. అరటి సాగుకు ప్రభుత్వం కొన్నేళ్లుగా రాయితీ ఇవ్వడం లేదు. మే నెల నుంచి ఈదురుగాలులు, వర్షాలు, వరదలు, తెగుళ్ల ప్రభావంతో అరటి పంటకు నష్టం వాటిల్లింది. మహారాష్ట్రలో అత్యధికంగా అరటి సాగు జరుగుతోంది. శబరి నదీ పరివాహక ప్రాంతాల్లోనూ ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా రావడంతో లోకల్ అరటికి ఆశించిన స్థాయిలో మార్కెట్లో డిమాండ్ లేదు. అరటిని నిల్వ చేసుకొనే సౌకర్యాలు కల్పించాలని, ఆ దిశగా అధికార యంత్రాంగం చొరవ చూపించాలని రైతులు కోరారు.

**దసరాపైనే ఆశలు**

మూడున్నర ఎకరాల్లో అరటి సాగు చేశాను. మార్కెట్లో ఒక్కో రోజు ఒక్కో ధర ఉంటోంది. ధర ఉందని అధిక సంఖ్యలో గెలలు దించితే ఒకేసారి ధరలు పడిపోతున్నాయి. పచ్చి వ్యాపారం కావడంతో వ్యాపారులు అడిగిన ధరకు విక్రయించక తప్పడం లేదు. ప్రభుత్వం అరటిని నిల్వ చేసుకునే సౌకర్యాలు కల్పిస్తే, కొంత ఊరట కలిగే అవకాశాలుంటాయి. దసరాపైనే ఆశలు పెట్టుకున్నాం.

**-దేవరపల్లి సత్యనారాయణ,**
**తీపర్రు గ్రామం, పెరవలి మండలం**

## వైసిపికి వచ్చిన రూ.330 కోట్ల సంగతేంటి?

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



2019లో తమ పార్టీకి రూ.27 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చాయంటున్న దర్యాప్తు సంస్థలు, వైసిపికి వచ్చిన రూ.330 కోట్ల సంగతేంటో చెప్పాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపికి 2019లో రూ.99.84 కోట్లు, 2019-20లో రూ.74.35 కోట్లు, 2020-21లో రూ.96.25 కోట్లు, 2021-22లో రూ.60 కోట్లు వచ్చాయని తెలిపారు. ఈ విరాళాలిచ్చిన వ్యక్తులు, సంస్థల పేర్లు పత్రికల్లో ప్రచురించే దమ్ము వైసిపి అధినేత జగన్‌కు ఉందా? అని ప్రశ్నించారు. 2023 ఏప్రిల్‌లో టిడిపి నిధుల వివరాలను సిఐడి అధికారులు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి అధికారికంగా డౌన్‌లోడ్ చేశారన్నారు.

దర్యాప్తు సంస్థలు ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు తలొగ్గి చట్ట ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయని అచ్చెన్న విమర్శించారు. చంద్రబాబుకు బెయిల్ రాకుండా చేసేందుకు దర్యాప్తు సంస్థలు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న కుట్ర మాత్రమేనన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు భార్య భువనేశ్వరికి సంఘీభావం తెలిపేందుకు పాదయాత్రగా వస్తున్న టిడిపి కార్యకర్త నారాయణపై వైసిపి మూక దాడి చేసిందని, దీనిని ఖండిస్తున్నట్లు మరో ప్రకటనలో అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# మణిపూర్‌లో మళ్లీ హింస

- ఇంఫాల్‌లో రెండు ఇళ్లకు నిప్పు
- పలు రౌండ్ల కాల్పులు జరిపిన పోలీసులు



**ఇంఫాల్ :** ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో అల్లర్లు, నిరసనల సెగలు ఇంకా చల్లారటం లేదు. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో హింస చెలరేగింది. ఆందోళనకారులు రెండు ఇళ్లకు నిప్పు పెట్టారు. అల్లర్లను అదుపులోకి తీసుకురావటానికి పోలీసులు పలు రౌండ్ల కాల్పులు జరిపారు. బుధవారం రాత్రి పది గంటల సమయంలో పటోసి పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకున్నదని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పారిపోయారని, ఇళ్లకు నిప్పు పెట్టటంతో ఆ ప్రాంతంలో ఆందోళనకర వాతావరణం చోటు చేసుకున్నదని చెప్పారు. భద్రతా బలగాలు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారని అన్నారు. ఈ ఘటన అనంతరం మెయితీ తెగకు చెందిన మహిళల గ్రూపు ఆ ప్రాంతంలో గుమికూడటంతో భద్రతా బలగాలు వారిని నిరోధించాయని పోలీసు అధికారులు తెలిపారు. ఆందోళనకర ఘటనల నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశామని, అదనపు భద్రతా సిబ్బందిని మోహరించామని వివరించారు. ప్రస్తుతం ఇక్కడ పరిస్థితి అదుపులో ఉన్నదన్నారు.

ఈ ఏడాది మే 3 నుంచి మణిపూర్‌లో మెయితీ, కుకీ గ్రూపుల మధ్య కొనసాగుతున్న జాతి హింస కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. వందల సంఖ్యలో ఆందోళనకారులు, ప్రజలు గాయపడ్డారు. కేంద్రం, రాష్ట్రంలో రెండు చోట్లా అధికారంలో ఉన్న బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాలు ఇక్కడి అల్లర్లకు అడ్డుకట్ట వేయకపోగా, ఒక గ్రూపునకు కొమ్ముకాస్తుండటంపై అక్కడి పౌరులు, సామాజికవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పనులకు కాంట్రాక్టర్ల విముఖత

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే పనుల పరిస్థితి దినదినగండంగా మారుతోంది. చేసిన పనులకు నిధులు ఇవ్వలేకపోవడంతో కాంట్రాక్టర్లు పనుల నిర్వహణపై విముఖత వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఏటా బిల్లుల సంఖ్యతోపాటు నగదు చెల్లింపులుకూడా తగ్గుతున్నాయి. తాజాగా ప్రధాన అక్కౌంటెంట్ జనరల్ (పిఏజి)మచ్చుకు వెల్లడించిన గణాంకాలు దీనికి అద్దం పడుతున్నాయి.పిఏజి నివేదిక ప్రకారం గత కొన్నేళ్లుగా పలు నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులు గణనీయంగా తగ్గిపోతున్నట్లు కనిపిస్తోంది. ఇదే సమయంలో ఆయా బిల్లులకు చెల్లిస్తున్న మొత్తంలో కూడా కోతలు పడుతున్నాయి. ఉదాహరణకు 2018-19లో 1.03 లక్షల బిల్లులు రాగా, వాటికి రూ. 27,431 కోట్లు చెల్లించారు. ఆ తరువాత 2019-20లో బిల్లుల సంఖ్య ఒక్కసారిగా సగానికి పడిపోయింది. ఆ బిల్లులపై 25,607 కోట్ల వరకు చెల్లింపులు జరిగినట్లు తేలింది. ఆ తరువాత సంవత్సరం 60 వేల వరకు మాత్రమే బిల్లులు రాగా, చెల్లింపులు 23 వేలకోట్ల వరకు జరిగాయి. ఇక 2021-22 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకు తేలిన లెక్కల మేరకు కేవలం 12 వేల వరకు మాత్రమే బిల్లులు రాగా, వాటిపై కేవలం మూడు వేల కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయని పిఏజి లెక్కలు తేల్చింది.

**నిధులు లేకనే**

ఖజానాలో నిధులు నిండుకుండడం వల్లనే నిర్మాణ పనులకు బిల్లులు చెల్లించలేకపోతున్నట్లు ఆర్థికశాఖ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. ఈ కారణంగానే బిల్లులు కూడా తగ్గిపోతున్నట్లు పేర్కొన్నారు. కొన్ని బిల్లులు వచ్చినా నిధులు లేకపోవడం వల్ల పలు కారణాలను చూపిస్తూ ఆ బిల్లులను వెనుకకు పంపిస్తున్నారు.

ఇలా చేసిన పనులకు కూడా బిల్లులు రాకపోవడంతో చిన్న చిన్న కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు వెనుకంజ వేస్తున్నట్లు అధికారులే అంగీకరిస్తున్నప్పటికీ, తామేమీ చేయలేకపోతున్నామంటూ చేతులెత్తేస్తున్నారు.

**వర్క్ బిల్లులకు జరిగిన చెల్లింపుల వివరాలు ఇవే (రూ. కోట్లలో)**

| ఏడాది | బిల్లులు | నగదు |
|---|---|---|
| 2018-19 | 1,02,980 | 27,431 |
| 2019-20 | 55,501 | 25,607 |
| 2020-21 | 60,237 | 23,281 |
| 2021-22 | 11,908 | 3,007 |
| సెప్టెంబర్ వరకు | | |

## ఎపి ఫైబర్ గ్రిడ్ కేసులో తీర్పు రిజర్వు

ప్రజాశక్తి-అమరావతి

ఎపి ఫైబర్ గ్రిడ్ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టులో వాద ప్రతివాదనలు పూర్తయ్యాయి. దీంతో తీర్పును రిజర్వులో పెడుతున్నట్లు జస్టిస్ కె సురేష్‌రెడ్డి ప్రకటించారు. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ అగర్వాల్, సిఐడి తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ వాదనలు వినిపించారు. 'ఫైబర్ గ్రిడ్ వ్యవహారం విధానపరమైనది. ఇందులో ఇతరులు తప్పు చేస్తే నాటి సిఎం చంద్రబాబును నిందితుడిగా చేయడం చట్ట వ్యతిరేకం. ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో పిటిషనరు అరెస్టయ్యారు. ఆ అరెస్టునే ఈ కేసులో కూడా చూపించాలి. అరెస్టు అయినట్లుగా పరిగణించాలి. దీనిపై ఎసిబి కోర్టు నిర్ణయం తీసుకోవడానికి ముందే పిటిషనరుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలి' అని అగర్వాల్ వాదించారు. ఒక కేసులో జైలుకు వెళ్లారని చెప్పి మరో కేసులోనూ అరెస్టు అయినట్లుగా పరిగణించడానికి వీల్లేదని ఎస్ శ్రీరామ్ ప్రతివాదన చేశారు. అన్ని ఆధారాలూ సేకరించిన తర్వాతే సిఐడి పిటిషనరును నిందితుడిగా చేర్చిందన్నారు. ముందస్తు బెయిల్ ఇవ్వరాదన్నారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు.. తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

**పోలీసులు చట్టం ప్రకారం వ్యవహరించాలి**

వైసిపి నేతలు పేర్ని నాని, వల్లభనేని వంశీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టిడిపి నేత బుద్ధా వెంకన్నపై నమోదు చేసిన కేసులో పోలీసులు చట్ట ప్రకారం వ్యవహరించాలని హైకోర్టు ఆదేశించింది. సిఆర్‌పిసిలోని 41ఎ సెక్షన్ కింద బుద్ధా వెంకన్నకు నోటీసులు జారీ చేసి విచారణ చేయాలని పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. తమపై బుద్ధా వెంకన్న అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పేర్ని నాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్కూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని కొట్టేయాలని, పోలీసులు తనను అరెస్టు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని బుద్ధా వెంకన్న దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారణ జరిపింది.

**కోర్టు అనుమతి తీసుకునే అరెస్టు చేయాలి**

టిడిపి నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి 41ఎ నోటీసులు తీసుకోకపోతే వెంటనే ఎలా అరెస్టు చేస్తారని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. నోటీసు అందుకోలేదన్న విషయాన్ని కోర్టుకు చెప్పాలని, కోర్టు అనుమతి తీసుకుని అరెస్టు చేయాలని చెప్పింది. అలా చేయకుండా అరెస్టు చేయడం ఏమిటని అడిగింది. ఈ వ్యవహారంపై కౌంటర్ పిటిషన్ దాఖలు చేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఎందుకు వేయలేదని ప్రశ్నించింది. బండారు రిమాండ్ ఉత్తర్వుల ప్రతిని నివేదించాలని పోలీసులను ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది.

## ఎన్‌డిఎ నుంచి బయటికి వస్తే నేనే చెప్తా..!

- కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం
- ముదినేపల్లి సభలో పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ముదినేపల్లి



బహిరంగ సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

'ఎన్‌డిఎ కూటమి నుంచి జనసేన బయటికొచ్చిందంటూ వైసిపి ప్రచారం చేస్తోంది.. తాము ఎన్‌డిఎలో ఉంటే మీకేంటి.. లేకపోతే మీకేంటి బాధ?, ఎన్‌డిఎ నుంచి బయటికొస్తే నేనే చెబుతాను.. ఇప్పటికీ జనసేన ఎన్‌డిఎలోనే ఉంది' అని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ తెలిపారు. వారాహి యాత్రలో భాగంగా ఏలూరు జిల్లా ముదినేపల్లిలో గురువారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు.కనీసం రోడ్లు వేయలేని, పెద్దింట్లమ్మ గుడికి వంతెన నిర్మించలేని సిఎం 175 సీట్లు వస్తాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కొల్లేరు ప్రజలకు టిడిపి, జనసేన అండగా ఉంటుందన్నారు. విద్యార్థులకు ఇంటర్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేని దుస్థితి ఈ ప్రభుత్వంలో ఉందని ఎద్దేవా చేశారు. ముదినేపల్లి మండలంలో ఆరువేల మంది తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వినతులు ఇచ్చారని తెలిపారు. టిడిపి, జనసేన కూటమి వచ్చిన ఆరు నెలల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మద్యపాన నిషేధమని చెప్పి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, కల్తీమద్యంతో జనం అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కొల్లేరులోని 52 మత్స్యకార సంఘాలను నిర్వీర్యం చేశారని, తాము వచ్చాక సంప్రదాయ వేట చేసుకునేందుకు అండగా ఉంటామని తెలిపారు. రాష్ట్రంలో 45 శాతం ఆదాయం తెస్తున్న ఆక్వా పరిశ్రమకు, రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు . ఉచిత పథకాలకు వ్యతిరేకం కాదని, సంపద సృష్టించలేకపోవడాన్ని తప్పుపడుతున్నామని పేర్కొన్నారు. జగన్‌ను ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ సభకు జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.

## కృష్ణా జలాల అంశాన్ని కేంద్రం తిరగతోడటం సరికాదు

- అధికారులు, న్యాయ నిపుణులతో సమీక్షిస్తాం
- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం కృష్ణా జలాలకు సంబంధించి ట్రిబ్యునల్ అవార్డులను మళ్లీ తిరగతోడటం సరైందికాదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. కేంద్ర కేబినెట్ నిర్ణయంపై అధికారులు, న్యాయ నిపుణులు, ఇంజినీర్లతో సమీక్ష చేస్తామని తెలిపారు. తాడేపల్లిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాలకు సంబంధించి ట్రిబ్యునల్ యాక్ట్ ప్రకారం కేటాయింపులు వుంటాయని, ట్రిబ్యునల్ తీర్పులను కాదని కేటాయింపులు మార్చడం అంత సులువు కాదని అన్నారు. ఈ అంశంపై టిడిపి రాజకీయం చేయడం సరైందికాదన్నారు. కేంద్ర కేబినెట్ అంశాలపై ముఖ్యమంత్రి స్పందించడం లేదని విమర్శలు చేయడం తగదన్నారు. పూర్తి వివరాలు తెలియకుండా స్పందించడం సరికాదన్నారు. కేంద్ర కేబినెట్ నిర్ణయం పూర్తి వివరాలు రావాల్సి వుందని అన్నారు. రాష్ట్రంలో టిడిపి బలహీన పడిందని, అందుకే అండగా వుండాల్సి వచ్చిందని పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యల పట్ల టిడిపి స్పందించాలని డిమాండ్ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అడ్డంగా చంద్రబాబు దొరికిపోయారని, అందుకే జైలులో వున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే జగన్ ఢిల్లీకి వెళ్లారు తప్ప.. రాజకీయ ప్రయోజనాల కోసం కాదని అన్నారు.

## బిజెపి ఓటమితోనే దేశానికి రక్ష

మొదటి పేజీ తరువాయి

స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడం కోసం 'ఇండియా' వేదికగా చర్చలు జరిపి ఫలప్రదమైన నిర్ణయాలు చేయనున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే జోన్ లేదు, కడప స్టీల్‌ప్లాంట్ రాలేదు, నష్టాలు చూపించి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను తెగనమ్మాలని బిజెపి చూస్తోంది అంటూ మండిపడ్డారు. 'ఇప్పటివరకూ 965 రోజులుగా పోరాడుతున్నారు. గెలిచేవరకూ సిపిఎం మీతోనే ఉంటుంది. మోడీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాడండి' అని ఉక్కు దీక్షాపరులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

**ఉక్కు జోలికొస్తే ప్రజలు అంతు చూస్తారు : వి శ్రీనివాసరావు**

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమ్మితే ప్రజలు వారి అంతు చూస్తారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజల శ్రమ ఫలితమని అన్నారు. మొన్నటి వరకూ ప్లాంట్‌ను అమ్మేస్తాం... అమ్మేస్తాం అన్న మోడీ... నేడు చంపేస్తాం... చంపేస్తాం అంటున్నారని, అమ్మితే అంతు చూస్తామని శ్రీనివాసరావు హెచ్చరించారు. అభివృద్ధి నినాదంతో మోడీ అధికారంలోకి వచ్చి దేశాన్ని అంధకారంలోకి నెట్టేస్తున్నారని, ఇలాంటి ప్రజా ఉద్యమ సభలతో మోడీ కార్మిక వ్యతిరేక విధానాలకు సమాధానం చెబుతామని అన్నారు. రాష్ట్రాన్ని అదానీ, అంబానీలకు ధారాదత్తం చేసేందుకు చూస్తున్నారని, ఆ క్రమంలోనే రూ.3 లక్షల కోట్ల విలువైన ప్లాంట్ సంపదపై వారి కళ్లు పడ్డాయని విమర్శించారు.

స్టీల్‌ప్లాంట్ విషయంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీ ఎందుకు మౌనం దాల్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు మోడీ ఉరివేస్తానంటే తాడును జగన్ అందిస్తారా? అంటూ ప్రశ్నించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరాం, సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు మాట్లాడారు. వేలాది మంది రాకతో కూర్మన్నపాలెం పరిసరాలు ఉక్కు నినాదంతో హోరెత్తాయి. ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు చైతన్యం నింపాయి. ఉక్కు రక్షణ బైకు యాత్రలో పాల్గొన్న వారికి వేదికపై అతిథులు జ్ఞాపికలు అందజేశారు.

## రాష్ట్ర ప్రయోజనాలకు ఉరి

- టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

జగన్ చేసిన నేరాలు రాష్ట్ర ప్రయోజనాలకు ఉరి వేస్తున్నాయని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. అక్రమాస్తుల కేసుల మాఫీ కోసం ప్రత్యేక హోదా వదులుకున్నారని గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రుషికొండకు గుండు కొట్టిన కేసు తప్పించుకునేందుకు, విశాఖ రైల్వేజోన్‌కు నీళ్లొదిలారని అన్నారు. బాబాయిని చంపేసిన కేసులో తమ్ముడిని రక్షించుకునేందుకు ఏకంగా రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేశారని విమర్శించారు. జగన్ సర్కారు దారుణ వైఫల్యం వల్లే కృష్ణా జలాల కేటాయింపులు పున:సమీక్ష జరుగుతోందని అన్నారు. రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలు తీర్చే కృష్ణా జలాల్లో న్యాయబద్ధమైన వాటా కోల్పోతే రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**కృష్ణా జలాల కేటాయింపులో రాష్ట్రానికి తీవ్ర నష్టం : మర్రెడ్డి**

సిఎం అసమర్థత, చేతగాని తనం వల్ల కృష్ణా జలాల్లో రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని తెలుగురైతు విభాగం అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో జరిగిన కేటాయింపులకు విరుద్ధంగా కృష్ణా మిగులు జలాల్లో ఎక్కువ వాటా ఉందని తెలంగాణ వాదించడం, దీనిపై జగన్ మౌనం వహించడం ముమ్మాటికీ రాష్ట్రానికి తీరని నష్టం కలిగించడమేనని విమర్శించారు. సుప్రీంకోర్టులో రాష్ట్రం తరపున ప్రభుత్వం సమర్థవంతంగా వాదనలు వినిపించి రాష్ట్ర రైతాంగానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## కృష్ణా జలాల పంపిణీపై కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలి


- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కృష్ణా జలాల పంపిణీపై కేంద్ర బిజెపి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణా జలాల పంపిణీపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల పంపిణీపై పున:సమీక్షించడం ద్వారా వివాదం సృష్టించి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో లబ్ధి పొందాలని కేంద్రం చూస్తోందన్నారు. నాలుగు రాష్ట్రాలకు కలిపి ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు మాత్రమే కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు వెనక పెద్ద కుట్ర దాగి వుందన్నారు.

# భారత్‌లో పెరిగిన కుబేరులు

## ఫోర్బ్స్–2023 సంపన్నుల జాబితా వెల్లడి



- దేశంలో 169 మంది బిలియనీర్లు
- టాప్‌లో ముకేష్ అంబానీ.. అదానీకి హిండెన్‌బర్గ్ దెబ్బ

**న్యూఢిల్లీ :** భారత్‌లో అధిక ధరలతో ప్రజల ఆదాయాలు పడిపోతుంటే.. కుబేరుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ప్రముఖ అమెరికన్ మాగజైన్ ఫోర్బ్స్ ప్రపంచంలోనే అత్యంత సంపన్నుల జాబితా–2023ను ప్రకటించింది. ఫోర్బ్స్ విడుదల చేసిన ఈ 37వ ఎడిషన్ జాబితాలో భారత్ నుంచి 169 మంది బిలియనీర్లుగా గుర్తింపు పొందారు. గతేడాది ఈ సంఖ్య 166గా ఉంది. కనీసం రూ.8వేల కోట్ల పైబడిన వారిని బిలియనీర్‌గా పేర్కొంటారు. దేశంలో మెజారిటీ సాధారణ ప్రజల ఆదాయాలు పడిపోయి.. కనీస పొదుపు కూడా చేయలేని స్థితిలోకి దిగజారగా, మరోవైపు సంపన్నులు పెరగడం ఆందోళనకరం. ఇది తీవ్ర ఆర్థిక అసమానతలకు నిదర్శనమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**టాప్ 10 భారత అపర కుబేరులు**

| పేరు | (ఇండియా ర్యాంక్) | గ్లోబల్ ర్యాంక్ | సంపద (బిలియన్ డాలర్లు) | కంపెనీ |
|---|---|---|---|---|
| ముకేష్ అంబానీ | 1 | 11 | 90.5 | రిలయన్స్ ఇండస్ట్రీస్ |
| గౌతం అదానీ | 2 | 23 | 54.6 | అదానీ గ్రూపు |
| శివ్ నాడార్ | 3 | 50 | 28.4 | హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ |
| సావిత్రి జిందాల్ కుటుంబం | 4 | 70 | 23.8 | జెఎస్‌డబ్ల్యు గ్రూప్ |
| సైరస్ పునావాలా | 5 | 84 | 20.6 | సీరం ఇన్‌స్ట్యూట్ ఆఫ్ ఇండియా |
| దిలీప్ సంఘ్వి | 6 | 89 | 18.3 | సన్ ఫార్మాస్యూటికల్ |
| కుమార్ బిర్లా | 7 | 102 | 17.4 | ఆదిత్యా బిర్లా గ్రూపు |
| రాధా కిషన్ దమానీ | 8 | 97 | 17.2 | డిమార్ట్ |
| లక్ష్మీ మిట్టల్ | 9 | 104 | 15.5 | అర్సెలర్ మిట్టల్ |
| ఉదయ్ కొటాక్ | 10 | 131 | 13.2 | కొటాక్ మహీంద్రా బ్యాంక్ |

పాలక పక్షం మద్దతుతో అదానీ, అంబానీ ల ఆదాయాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ ఏడాది జాబితాలో దేశంలో ముకేష్ అంబానీ అత్యంత సంపన్నుడిగా అగ్రస్థానంలో నిలిచారు. ప్రపంచ స్థాయిలో అంబానీ 90.5 బిలియన్ డాలర్ల (రూ.7.5 లక్షల కోట్లు) సంపదతో 11వ ర్యాంక్‌ను పొందారు. తర్వాత స్థానంలో గౌతం అదానీ 54.6 బిలియన్ డాలర్ల (రూ.4.55 లక్షల కోట్లు)తో రెండో స్థానంలో నిలువగా.. గ్లోబల్‌గా 23వ స్థానంలో ఉన్నారు. గతేడాదితో పోల్చితే అదానీ స్థానం, ఆదాయం భారీగా తగ్గింది. అదానీ కంపెనీల ఆర్థిక మోసాలు, కృత్రిమం గా షేర్ల ధర పెంపు అంశాలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికతో గౌతం అదానీ ఆదాయం భారీగా క్షీణించింది. గతేడాది అదానీ 3వ ర్యాంక్‌లో ఉన్నారు.

ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచ స్థాయి కుబేరుల జాబితాలో టెస్లా, ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ 240.7 బిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో ఉన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ వీటన్ బ్రాండ్ ఫౌండర్ బెర్నార్డ్ జీన్ అర్నాల్ట్ 231.4 బిలియన్లతో రెండో స్థానంలో నిలిచారు.

154.9 బిలియన్ డాలర్లతో అమెజాన్ చీఫ్ జెఫ్ బెజోస్ మూడో స్థానంలో ఉన్నారు. తర్వాత స్థానాల్లో లారీ ఎల్సన్, వారెన్ బఫెట్, బిల్‌గేట్స్, మైకెల్ బ్లూమ్‌బర్గ్ ఉన్నారు.

## ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

- బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలోని అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఏజెన్సీలను రద్దు చేసి అందులో పనిచేస్తున్న ఉద్యోగులను ఆప్కాస్‌లో విలీనం చేసి ఉద్యోగభద్రత కల్పించాలని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లుతో పాటు ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోధరరావు మాట్లాడారు. ఆర్టీసీలో పనిచేస్తున్న 8వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు యజమాన్యం ఉద్యోగభద్రతను కల్పించాలని కోరారు. కాంట్రాక్టు దళారి వ్యవస్థను రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి నరసయ్య, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ కె సుమన్ తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించాలి – ఎస్‌డబ్ల్యుఎఫ్**

ఎపిఎస్ ఆర్‌టిసిలో పనిచేస్తున్న అద్దెబస్సుల డ్రైవర్లు, కాల్ ఆన్ డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలానిభాష, అధ్యక్షకార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, ఎం అయ్యప్పరెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రం సమర్పించారు. అద్దెబస్సుల సిబ్బంది, కాల్ ఆన్ డ్రైవర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సమానపనికి సమానవేతనం నిబంధనను వర్తింపజేయాలని కోరారు. అలాగే అందరికీ పిఎఫ్‌ను అమలు చేయాలని, వారాంతపు సెలవులను ఇవ్వాలని కోరారు. ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

**ఆప్కాస్‌లో విలీనం చేయండి– ఎన్ఎంయు**

ఎపిఎస్ ఆర్‌టిసిలో అవుట్ సోర్సింగ్‌లో పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్లు, కాల్ ఆన్ డ్రైవర్లు, అన్ని విభాగాల్లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో విలీనం చేయాలని ఎపిపిటిడి ఎన్ఎంయు డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావులు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగులకు వర్తించే అన్నీ సౌకర్యాలను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేయాలని కోరారు.

## ఒప్పందాలకు విరుద్ధంగా రాయలసీమ ఎత్తిపోతలు

- కృష్ణా బోర్డుకు తెలంగాణ ఫిర్యాదు

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ధిక్కరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పనులు చేపడుతోందని తెలంగాణ ప్రభుత్వం కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల ఇంజనీర్ ఇన్ చీఫ్ సి మురళీధర్ కృష్ణా బోర్డు చైర్మన్‌కు గురువారం లేఖ రాశారు. కృష్ణా జలాలను రాయలసీమ ఎత్తిపోతల ద్వారా బేసిన్ వెలుపలకు తరలించే పనులు ఎపి ప్రభుత్వం చేపడుతోందని, 59 టిఎంసిల నీటిని తరలించేలా పనులు కొనసాగిస్తోందని లేఖలో ఇఎన్‌సి ప్రస్తావించారు. అంతర్రాష్ట్ర ఒప్పందాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. పనులు కొనసాగితే తెలంగాణ ప్రాజెక్టులకు భారీగా నష్టం జరుగుతుందని తెలిపారు. తక్షణమే స్పందించి ఎపి చేపడుతున్న పనులను నిలిపివేయించాలని కృష్ణా బోర్డు చైర్మన్‌ను కోరారు.

## పేదల భూములు పేదలకే ఇవ్వాలి : వ్యకాస

- కుశలవ భూముల్లో భూస్వాధీన పోరాటం

ప్రజాశక్తి – లేపాక్షి

శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షి మండలంలోని కొండూరు, కొర్లకుంట గ్రామాల్లో పరిశ్రమ ఏర్పాటు పేరుతో పేదల నుంచి కుశలవ సంస్థ సేకరించిన భూములను తిరిగి వారికే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. కుశలవ సంస్థకు ఇచ్చిన భూముల్లోని పిచ్చిమొక్కలను దళితులు, పేద రైతులు గురువారం తొలగించి భూ స్వాధీన పోరాటాన్ని నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ పోరాటం నిర్వహించారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. పరిశ్రమ ఏర్పాటైతే ఉపాధి లభిస్తుందన్న ఆశతో సాగు భూములను దళితులు, పేద రైతులు ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. అందులో భాగంగానే లేపాక్షిలో అసైన్డ్ భూములను కుశలవ అనే ప్రయివేటు సంస్థకు 600 ఎకరాలను ప్రభుత్వం కారుచౌకగా కట్టబెట్టిందని తెలిపారు. భూములు తీసుకున్న సంస్థ పరిశ్రమ స్థాపన కోసం కనీసం ఇటుక కూడా పేర్చలేదని విమర్శించారు. 150 ఎకరాలను ప్రయివేటు వ్యక్తులకు విక్రయించడంతో అధికారులు ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నారని, ఈ భూములను సాగుదారులకు ఇవ్వకుండా అసైన్డ్ భూ పంపిణీలో భూస్వాములకు కట్టబెట్టె కుట్ర జరుగుతోందన్నారు.అసైన్డ్ చట్టం ప్రకారం పేదల భూములను పేదలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న స్పందిస్తూ పేదలు ఆందోళన చేస్తుంటే కేసులు పెడతామని బెదిరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యుల నారాయణ, రాయుడు, భూ పోరాట సాధన కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

# భూపోరాటంపై పోలీసు ఉక్కుపాదం

- నమ్మించి మోసం చేసిన అధికారులు
- చిలమత్తూరులో పేదల గుడిసెలు తొలగింపు

ప్రజాశక్తి–చిలమత్తూరు



పేదలు వేసుకున్న గుడిసెలను జెసిబిలతో తొలగిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

భూస్వాధీన పోరాటంపై రెవెన్యూ అధికారులు పోలీసుల సాయంతో ఉక్కుపాదం మోపే ప్రయత్నం చేశారు. ఇళ్ల పట్టాలిస్తామని నమ్మించి రెండు రోజులకే గుడిసెలను కూల్చివేసి నమ్మకద్రోహానికి పాల్పడ్డారు. గత 20 రోజులుగా శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరులో ఇళ్ల పట్టాల కోసం సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో పేదలు భూస్వాధీన పోరాటం నిర్వహిస్తున్నారు. కోడూరు రెవెన్యూ పొలం 805 సర్వే నెంబర్‌లో కొట్టాలు వేసుకుని అక్కడే నివాసముంటున్నారు. రెండ్రోజుల క్రితం వీరందరికీ పట్టాలు ఇస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ హామీని తుంగలో తొక్కి పేదలకు నమ్మకం ద్రోహం చేసే చర్యలను అధికారులు చేశారు. గురువారం వేకువజామున సుమారు వంద మంది పోలీసులు జెసిబిలో 805 సర్వే నెంబర్‌లోకి చొరబడ్డారు. పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేశారు. అడ్డుపడ్డ పేదలు, సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. మహిళలని కూడా చూడకుండా విచక్షణ రహితంగా ఈడ్చుకుంటూ వారిని లారీల్లోకి ఎక్కించారు. సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, అధ్యక్షుడు లక్ష్మినారాయణ, సిఐటియు జిల్లా నాయకులు రమేష్, కమిటీ సభ్యులు శివ, రహంతుల్లా, చరణ్, నరసింహా, సదాశివరెడ్డి, రాజు, మంజు, మహిళలను అరెస్టు చేసి చిలమత్తూరు, లేపాక్షి పోలీసు స్టేషన్లకు తరలించారు. అరెస్టు చేసే క్రమంలో పలువురు మహిళలకు గాయాలు సైతం అయ్యాయి. గుడిసెల్లో పేదలు ఏర్పాటు చేసుకున్న మంచాలు, వస్తువులు, నిత్యావసరాలను చిందరవందర చేశారు. పోలీసులు, అధికారుల తీరుపై సిపిఎం నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ చిలమత్తూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో పేదలు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం ఇంతియాజ్, వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిఎల్ నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చేతులు రావడం లేదన్నారు. శాంతియుతంగా పోరాడుతున్న పేదలపై ఈ రకమైన బలవంతపు దాడులు చేసే విధానాలు సరికాదని విమర్శించారు. పెద్దసంఖ్యలో పోలీసులు మోహరించడం, పేదలను కొట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాటల్లో చెబుతున్నారని, ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా చేస్తున్నారని విమర్శించారు. ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు ఈ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు.

# ఆఫ్‌లైన్‌లో పోలీసు సేవలు

- బిల్లులు రాక చేతులెత్తేసిన సాఫ్ట్‌వేర్ సంస్థలు
- రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిన సర్వర్

ప్రజాశక్తి–అనంతపురం ప్రతినిధి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటు లోకి వచ్చాక ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్ అవుతుండటం పరిపాటే. ఇదే తరహాలో పోలీసు సేవలు కూడా ఆన్‌లైన్‌లో ఎంతోకాలంగా నడుస్తూ వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో పోలీసు సేవలన్నీ ఇప్పుడు ఆఫ్‌లైన్‌లోనే నడుస్తున్నాయి. ఎఫ్ఐఆర్‌లు, వాహనా జరిమానాలు అన్ని ఆఫ్‌లైన్‌లో కొనసాగుతున్నాయి.

**ఆగిన సిసిఎస్‌టిఎన్**

నేర చరితులకు సంబంధించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు దేశంలోని ఇతర ప్రాంతాలకూ ఇచ్చుపుచ్చుకునే విధంగా ఉండేదుకు కేంద్ర ప్రభుత్వం సిసిఎస్‌టిఎన్ (క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్కు అండ్ సిస్టమ్) పేరుతో ఓ వ్యవస్థను ఏర్పాటు చేసింది. 2012లో ప్రారంభమైన ఈ వ్యవస్థ కింద దేశంలోని సుమారు 15 వేల పోలీసు స్టేషన్లకు అనుసంధానం చేయబడ్డాయి. ఏ పోలీసు స్టేషన్‌లో అయిన ఎఫ్ఐఆర్ నమోదైయితే అన్ని స్టేషన్లలో ఆ సమాచారం తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. మన రాష్ట్రంలో 2012 నుంచి ఈ విధానం నడుస్తోంది. దీనికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసస్) అందిస్తూ వచ్చింది. ఈ సంస్థకు కొన్ని సంవత్సరాలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఆ సంస్థ ఈ ఏడాది జూన్ నుంచి తన సేవలను నిలిపివేసినట్టు సమాచారం. తదనంతరం దీని నిర్వహణను డాటా ఎవాల్వింగ్ అనే సంస్థకు అప్పగించారు. ఆ సంస్థకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో సేవలను నిలిపివేసినట్టు సమాచారం. దీంతో ఆన్‌లైన్ సేవలు మొత్తం నిలిచిపోయాయి.

**ఆఫ్‌లైన్‌లోనే ఎఫ్ఐఆర్‌లు**

సాంకేతిక సహకారం అందించే సంస్థలు నిర్వహణను నిలిపివేయడంతో పోలీసు సేవలన్నీ ఆగిపోయాయి. ఏదైనా కేసులొస్తే ఆఫ్‌లైన్‌లోనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. అదే విధంగా వాహనాల జరిమానాలు కూడా వేయలేని పరిస్థితి నెలకొన్నట్టు సమాచారం. ఆఫ్‌లైన్‌లో అనేక అవతవకలు జరుగుతున్న నేపథ్యంలో అన్నింటినీ ఆన్‌లైన్‌లోనే వేయాలని నిబంధనలు పెట్టారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ పనిచేయకపోవడంతో వీటిని కూడా వేయడానికి ఇబ్బందికరంగా మారినట్టు తెలుస్తోంది. ఈ పరిస్థితి ఎంతకాలముంటుందో చెప్పలేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు.










జాతీయ రహదారి పై నిర్మాణం కొరకు భూమి సేకరణ అందజేయుటకు అందులో ప్రయోజనం కలిగిన యజమానులు/వ్యక్తులందరికీ ప్రకటన. ఎన్.హెచ్ 16 పై విజయవాడ తూర్పు మండలానికి చెందిన విజయవాడ పట్టణంలోని విస్తరించి ఉన్న బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ యొక్క పశ్చిమ భాగంలో సర్వీస్ రోడ్డు నిర్మాణం కోసం కి.మీ. 0.300 (ప్రస్తుతం ఉన్న కి.మీ. 1098.680 (జ్యోతి మహల్ జంక్షన్ ముందు)) నుండి కి.మీ 2.770 (ప్రస్తుత కి.మీ. 1096.210 (రమేష్ హాస్పిటల్ జంక్షన్ దాటి)) సేకరించిన భూమిని స్వాధీనం చేసుకున్న పరిహారం మొత్తం చెల్లింపు మరియు డెలివరీ కోరకు కింద జారీ చేయబడిన నోటిఫికేషన్‌లో ప్రచురించబడిన పబ్లిక్ నోటీసును గమనించాల్సిందిగా భూమి యజమానులు/ప్రయోజనం కలిగిన వ్యక్తులందరినీ కోరడమైనది.

కింద జారీ చేయబడిన నోటిఫికేషన్‌లో ప్రచురించబడిన పబ్లిక్ నోటీసును గమనించాల్సిందిగా భూమి యజమానులు/ప్రయోజనం కలిగిన వ్యక్తులందరినీ కోరడమైనది.

- అవార్డు ప్రకటన
- వారి పరిహారం మొత్తాన్ని 60 రోజుల కాల వ్యవధిలోపల వసూలు చేసుకోనుట కొరకు కోరడం మరియు
- సంతకందారునకు భూ అధిగ్రహణ చేయబడిన భూమిని స్వాధీనపరచవలసిందిగా లేదా ఆధీనం చేయవలసిందిగా కోరడమైనది.

| క్ర. సం | ప్రచురించబడిన వార్తా పత్రికల పేర్లు | వార్తా పత్రికల తేది |
|---|---|---|
| 1 | ప్రజాశక్తి (తెలుగు) | 26.07.2023 |
| 2 | హన్స్ ఇండియా (ఇంగ్లీషు) | 26.07.2023 |

నిర్దేశిత 60 రోజుల గడువు ది. 23.09.2023. ముగిసినది.
తమ బ్యాంకు ఖాతా వివరాలను అందించిన భూ యజమానులకు సంబంధించి పరిహారం మొత్తం వారి సంబంధిత ఖాతాలకు జమ చేయబడును. ఇంకా, ఆ సమయంలో సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించిన వారికి కూడా చెల్లింపులు చేయబడును. మిగిలిన భూ యజమానులకు పరిహారం మొత్తం చెల్లింపుకు సంబంధించి, 18.07.2023. నాటి పబ్లిక్ నోటీసు ప్రకారం మొత్తం ఇప్పటికే టెండర్ చేయబడినందున వీలైనంత త్వరగా వారి చెల్లింపులను పొందడానికి ఈ కార్యాలయాన్ని సంప్రదించాలని వారిని మళ్లీ కోరడమైనది.
తదనుగుణంగా, భూయజమానులు/ఆసక్తిగల వ్యక్తులందరూ సేకరించిన భూమిని వెంటనే కింద సంతకం చేసిన వారికి అప్పగించవలసిందిగా కోరుతున్నారు, లేని పక్షంలో జాతీయ రహదారుల చట్టం 1956 లోని సెక్షన్ 3ఇ లోని సబ్-సెక్షన్ (2) ప్రకారం పోలీసు వారి సహకారంతో స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది.

సం./- శ్రీమతి అదితి సింగ్, I.A.S.,
సబ్ కలెక్టర్ & సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్,
విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా.

రోడ్లను మాత్రమే కాదు, జాతిని నిర్మిస్తుంది

సంపాదకీయం


# విభజించు-పాలించు!

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాలను పున:పంపిణీ చేయాలంటూ బ్రిజేష్ కుమార్ (కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2) ట్రిబ్యునల్‌కు అప్పగిస్తూ బుధవారంనాడు జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించడం ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి ముఖ్యంగా కరువు పీడిత రాయలసీమ ప్రజానీకానికి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కృష్ణా జలాల వినియోగం, పంపిణీ విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించడానికి కొన్ని నిబంధనలను, విధి విధానాలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. వీటి ప్రకారం పరిష్కరించాలని కెడబ్ల్యుడిటి-2కి సూచించింది కానీ ఆ వివరాలను మాత్రం వెల్లడించకపోవడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మూలంగా రాష్ట్ర ప్రయోజనాలకు హాని కలుగుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. తెలంగాణ అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బిజెపికి రాజకీయ ప్రయోజనం కలిగించడానికే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందన్న మాట సత్య దూరం కాదు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే 2023-24 కేంద్ర బడ్జెట్‌లో అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయించిన విషయాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. నదీజలాలు దేశ సంపద. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలన్నిటినీ సమ దృష్టితో చూడాలి. కానీ మోడీ సర్కారుకు అది కొరవడింది. పైపెచ్చు మతాల మధ్య, రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి తన రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలన్న తలంపు ఎక్కువ. విద్వేష సృష్టి పరివారీయులకు వెన్నతో పెట్టిన విద్య. 'విభజించు-పాలించు' అన్న బ్రిటిష్ పాలకుల సూత్రాన్ని వారు తు.చ. తప్పక అమలు చేస్తుంటారు. ఇదీ అదే!

అంతర్రాష్ట్ర నదీజల వివాద పరిష్కార చట్టం(1956) లోని సెక్షన్ 3 ప్రకారం రాష్ట్రాలు చేసిన అభ్యర్థనలపై 2004లో కేంద్ర ప్రభుత్వం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తుది తీర్పు గెజిట్‌లో పబ్లిష్ కావలసిన సమయంలో 2014లో రాష్ట్రం విడిపోయింది. తెలంగాణ సర్కారు తమకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కేటాయింపులు న్యాయసమ్మతంగా లేవని పేర్కొంది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ సిఫార్సులు గెజిట్‌లో ప్రచురితం కాకున్నా నికర జలాల కేటాయింపుల ఆధారంగా ఎ.పి 512 టిఎంసీలు, తెలంగాణ 299 టిఎంసీలు వినియోగించుకునేలా తాత్కాలిక ఏర్పాటు జరిగింది. కృష్ణా నదీ జలాల వినియోగం, పంపిణీ లేదా నియంత్రణపై వివాదాన్ని పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు 2015లో సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేసింది. దాన్ని ఉపసంహరించుకుంటే తగిన ఉత్తర్వులిస్తామని కేంద్ర జలశక్తి శాఖ చెప్పడంతో తెలంగాణ సర్కారు అలాగే చేసింది. ట్రిబ్యునల్ కాలపరిమితి ఉన్నంతవరకు ఈ ఒప్పందం అమలులో ఉండాల్సి ఉండగా, మధ్యంతరంగా మరోసారి కృష్ణా జలాల పున: పంపిణీకి కేంద్ర కేబినెట్ తాజాగా నిర్ణయించడం ఓ వైచిత్రి.

బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలు ప్రాజెక్టులు, సబ్ బేసిన్ల వారీగా రెండు రాష్ట్రాలు స్పష్టంగా పంచుకున్నాయి. ఇక మిగులు జలాలను ఉభయుల ప్రయోజనాలు నెరవేరేలా పంచుకోవాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని కరువు పీడిత, వెనుకబడిన ప్రాంతాలకు తాగు, సాగు నీరందించడమే లక్ష్యంగా శాస్త్రీయమైన పద్ధతిలో పంపిణీ, అలాగే నీటి నిర్వహణా షెడ్యూళ్లను నిర్ణయించాలి. అయితే, నదికి చివరన ఉన్నది ఆనాడు ఉమ్మడి రాష్ట్రం కాగా ఈనాడున్నది విభజిత ఆంధ్రప్రదేశే! అలాగే అంతర్జాతీయ జల సూత్రమైన రైపేరియన్ రైట్స్ కూడా పరిగణన లోకి తీసుకోవడం అవసరం. కీలకమైన నీటి విషయమై రైతాంగం మొత్తుకుంటుంటే రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఎప్పటి మాదిరిగానే పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటున్నాయే తప్ప వివాదం రాజేస్తున్న కేంద్ర బిజెపిని పల్లెత్తు మాట అనకపోవడం తీవ్ర ఆక్షేపణీయం. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలతో అఖిలపక్ష సమావేశం వెంటనే ఏర్పాటు చేసి కృష్ణా జలాల విషయమై ఏకాభిప్రాయం సాధించాలి. కేంద్రం కుట్రల్ని తెలుగు ప్రజలు తిప్పికొట్టాలి. బిజెపి పాలకుల ఆపద మొక్కులు నమ్మరాదు.

మంచి మాట



**మనం ప్రజలకు ఏమీ బోధించజాలం. అయితే వారు తమంతట తామే వాటిని కనిపెట్టేలా సహాయపడగలం.**

**- బెంజమిన్ ఫ్రాంక్లిన్,**
**రచయిత, శాస్త్రవేత్త, ఆవిష్కర్త.**

Benj. Franklin

# కిడ్నీ మార్పిడి విధానాల్లో సంస్కరణలు అవశ్యం

వ్యాఖ్య

**జే మెహతా**
**ఉత్కర్ష్ అగర్వాల్**
**జీవంత్ రాంపాల్**



**అవయవ మార్పిడి కోసం వేచి ఉండే వారి సమాచారం, స్వచ్ఛందంగా దానం చేస్తామని ముందుకు వచ్చే వారి వివరాలు నమోదు చేస్తున్నారే తప్ప జంట దానాల గుర్తింపు, చైన్ దాతల వివరాల నమోదును ప్రోత్సహించే ఏర్పాట్ల కోసం జాతీయ స్థాయిలో ఒక రెగ్యులర్ వ్యవస్థ అంటూ లేదు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో నిబంధనలను సరళతరం చేయడంలోను, అలాగే డోనర్ల (దాతల) సంఖ్యలోనూ ముందున్నాయి. దేశం మొత్తం మీద చూస్తే అవయవ దానాన్ని ప్రోత్సహించటం, ప్రజల్లో చైతన్యాన్ని పాదు కొల్పడం వంటి విషయాల్లో చెప్పుకోదగ్గ చర్యలు లేవు.**

దేశంలో అవయవ దాన వారోత్సవాలు ఇటీవల (సెప్టెంబర్ 26 నుండి అక్టోబర్ 2 వరకు) జరిగాయి. అవయవ దానాలకు సంబంధించి ఎక్కువగా జరిగేవి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు. ఈ సందర్భంగా కిడ్నీ దానం, మార్పిడి గురించి పరిశీలిద్దాం.

దేశంలో ఈ సమస్య తీవ్ర రూపంలో ఉంది. 2022లో 2 లక్షల మంది కిడ్నీ మార్పిడి కోసం నిరీక్షిస్తున్న వారు దేశంలో ఉండగా కేవలం 7500 మార్పిడి ఆపరేషన్లు మాత్రమే జరిగాయి. అంటే సుమారు 3.4 శాతం మందికే ఊరట లభించింది. మధుమేహం, పౌష్టికాహార లోపం, పారిశుధ్య లేమి, అధిక జన సాంద్రత తదితర కారణాల వల్ల క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సి.కె.డి) దేశంలో ఎక్కువగా ప్రబలుతోంది. దేశ జనాభాలో 17 శాతం మేరకు సి.కె.డి వ్యాధిగ్రస్తులు ఉంటారని ఒక అంచనా. సాధారణంగా ఇలాంటి వ్యాధితో ఉన్నవారు 'ఎండ్-స్టేజ్ కిడ్నీ వ్యాధి' (ఇ.ఎస్.ఆర్.డి) దశకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఇలాంటి కేసుల్లో పేషెంట్ ప్రయోజనాల రీత్యా ఇతర ప్రత్యామ్నాయ చికిత్సా విధానాల కన్నా కిడ్నీ మార్పిడి ఉత్తమ ఎంపిక అవుతుంది. శేష జీవితం ఫలవంతంగా ఉండేందుకు గాని, ఖర్చు రీత్యా గాని కిడ్నీ మార్పిడే మంచిదని అనుభవాలు చెబుతున్నాయి. అమెరికా తదితర అభివృద్ధి చెందిన దేశాల్లో 20 శాతం మేర అవసరమైన కేసుల్లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నారు. మన దేశంలో బాగా తక్కువగా జరుగుతుండడానికి ఆరోగ్య వ్యవస్థలో లోటుపాట్ల కంటే నిబంధనల సంక్లిష్టత ప్రధాన కారణంగా ఉంటున్నది.

**కిడ్నీ లభించే మార్గాలు**

1. మరణించిన వ్యక్తి నుండి సేకరణ. అందుకు మరణించిన వ్యక్తి లేదా వారి కుటుంబీకుల సమ్మతి అవసరం. అలానే మరణ కారణాలు, మరణించిన వ్యక్తి ఆరోగ్య స్థితి. ఇవన్నీ అనుకూలించినా, అవయవాన్ని సకాలంలో సేకరించి నిల్వ ఉంచగల సాంకేతిక సదుపాయాల లభ్యత. కిడ్నీ మార్పిడి వీటన్నింటిపై ఆధారపడి ఉంటుంది.

2. బంధువులలో, మిత్రులలో కిడ్నీ దానం చేయడానికి సిద్ధపడి ముందుకు వచ్చినా రక్త నమూనా, టిష్యూ నమూనాలు, పేషెంట్ నమూనాలతో వైద్యపరమైన అనుసంధానం (కంపాటిబిలిటీ) ఉండాలి. ఇవన్నీ కుదరడం అరుదుగా మాత్రమే జరుగుతుంది.

3. కిడ్నీ మార్పిడి కుటుంబీకుల మధ్యనే అయితే సాధ్యపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇది రెండు రకాలు. మొదటిది- పేషెంట్, తన జీవిత భాగస్వామి ఒక జంట అనుకుంటే అటువంటి రెండు జంటల మధ్య మార్పిడి. ఉదాహరణకు సునీతకు కిడ్నీ కావాలి. భర్త ఇవ్వడానికి సిద్ధమే. కానీ వైద్య పరీక్షలు అందుకు సమ్మతించలేదు. విజయలక్ష్మికి కూడా అదే అనుభవం. అప్పుడు సునీత భర్త విజయలక్ష్మికి, విజయలక్ష్మి భర్త సునీతకు కిడ్నీల మార్పిడి కోసం ముందుకు వచ్చి, అవి కుదిరితే...దాన్ని స్వాబ్ విధానం అంటారు. రెండవది- చైన్ విధానం. సురేష్ స్వచ్ఛందంగా కిడ్నీ దానం చేయడానికి ముందుకు వచ్చిన వ్యక్తి. పైన చెప్పిన సునీతకు సురేష్ కిడ్నీ మార్పిడి కుదిరింది అనుకుందాం. అపుడు సునీత భర్త విజయలక్ష్మికి విజయలక్ష్మి భర్త ఇంకొకరికి కిడ్నీ దానం చేస్తారు. దీన్నే చైన్ విధానం అంటారు. ఇంతకీ మన దేశంలో గణాంకాలు చూస్తే స్వాబ్ కేసులు అత్యంత అరుదుగా మాత్రమే ఉన్నాయి. చైన్ కేసులు అసలు లేనే లేవు. చట్టపరమైన కఠిన నిబంధనలే ఇందుకు కారణం. దీని వల్ల ఎంతో నష్టం జరుగుతున్నది. స్వాబ్ విధానానికి మన చట్టాలు అనుమతిస్తాయి. కానీ దాతలు సమీప బంధువుల జంటలు అయి ఉండాలి అనే షరతు ఉంది. కేరళ, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలు దీనికి మినహాయింపు. అక్కడ హైకోర్టులు సమీప బంధువులు కాని జంటలు అయినాసరే అనుమతిస్తూ తీర్పులిచ్చాయి. జాతీయ స్థాయిలో అవయవ దాతల రిజిస్టర్ ఉన్నట్లు, జంట దాతల సమాచారం సేకరించే ఏర్పాటు లేనందువల్ల కూడా ఎంతో నష్టం జరుగుతున్నట్లే! స్వచ్ఛందంగా కిడ్నీని దానం చేయడం చట్ట విరుద్ధం. కేరళ రాష్ట్రం మాత్రమే దీనికి మినహాయింపు. ఆ కారణంగా ఒక జంట దాతల కోసం ప్రయత్నమే జరగదు. చైన్ దాతల ఆలోచనే రాదు! జంట దాతలు, చైన్ దాతల వివరాల సేకరణ ఏర్పాట్లు జాతీయ స్థాయిలో నిర్వహించినట్లయితే అనవసర వెతుకులాట, వ్యక్తుల మనో వ్యధ, ఆసుపత్రి ఖర్చులు గణనీయంగా తగ్గి, కిడ్నీ మార్పిడి చికిత్సలు సరళతరంగా జరిగేందుకు సాధ్యమవుతుంది. అవేవీ లేనందువలన జరగాల్సిన మేలును... సమాజం నేడు కోల్పోతోంది.

కిడ్నీ దాన ప్రక్రియలో ఉన్న కఠినతర నిబంధనల పర్యవసానంగా కిడ్నీ అమ్మకాలకు బ్లాక్ మార్కెట్ ద్వారాలు తెరుచుకుంటున్నాయి. అత్యవసర ఆర్థిక ఒత్తిళ్ల వల్ల జరిగే కిడ్నీ అమ్మకాలు ఈ కోవకే చెందుతాయి. ఇలాంటి సందర్భాల్లో జరిగే ఆపరేషన్లు రికార్డుల్లో నమోదు కావు, అవి కూడా వైద్య ప్రమాణాలకు లోబడి జరగకపోవచ్చు.

మానవ అవయవాల, టిష్యూల మార్పిడిని క్రమబద్ధం చేస్తూ 1994లో కేంద్ర చట్టం వచ్చింది. 2011లో జంట దాతల విధానాన్ని అనుమతిస్తూ సవరించబడింది. వీటి అమలు కోసం చేసిన నిబంధనలు సమీప బంధువుల మధ్యనే జంట మార్పిడిని అనుమతిస్తున్నాయి. అవయవ మార్పిడి కోసం వేచి ఉండే వారి సమాచారం, స్వచ్ఛందంగా దానం చేస్తామని ముందుకు వచ్చే వారి వివరాలు నమోదు చేస్తున్నారే తప్ప జంట దానాల గుర్తింపు, చైన్ దాతల వివరాల నమోదును ప్రోత్సహించే ఏర్పాట్ల కోసం జాతీయ స్థాయిలో ఒక రెగ్యులర్ వ్యవస్థ అంటూ లేదు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో నిబంధనలను సరళతరం చేయడంలోను, అలాగే డోనర్ల (దాతల) సంఖ్యలోనూ ముందున్నాయి. అవయవ దానాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా తమిళనాడు ప్రభుత్వం ఒక ముందడుగు వేసింది. అవయవ దాతలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి గౌరవించాలని నిర్ణయించింది. దేశం మొత్తం మీద చూస్తే అవయవ దానాన్ని ప్రోత్సహించటం, ప్రజల్లో చైతన్యాన్ని పాదుకొల్పడం వంటి విషయాల్లో చెప్పుకోదగ్గ చర్యలు లేవు.

ఈ అంశంలో భారతదేశం ఇతర దేశాల నుండి గ్రహించాల్సింది చాలా ఉంది. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, నెదర్లాండ్స్, ఇంగ్లాండ్ వంటి దేశాల్లో వేలాదిగా అవయవ మార్పిడి చికిత్సలు జరుగుతూ ఉండడమే కాక, ఆ దేశాల మధ్య ఈ అంశంలో అంతర్జాతీయ సహకారం కూడా ఉంటున్నది. వాటి అనుభవాలు తెలుసుకోవడం, వాటిని మన పరిస్థితులకు అన్వయించుకోవడం ద్వారానే మన పౌరుల జీవితాలను మెరుగు పరుచుకోగలం.

**( జే మెహతా, ఉత్కర్ష్ అగర్వాల్ 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్' పూర్వ విద్యార్థులు. జీవంత్ రాంపాల్ అహ్మదాబాద్ లోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్'లో ఎకనామిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్.)**

కత్తిరింపులు

# ఎమర్జెన్సీ కాలం !



విమర్శనాత్మక జర్నలిజాన్ని ఏమాత్రం సహించలేని బిజెపి నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం, ఆన్‌లైన్ వార్తా వెబ్‌సైట్ 'న్యూస్ క్లిక్'పై తీవ్రమైన ప్రతీకార దాడులకు దిగింది, దారుణమైన వేధింపులకు గురి చేసింది. అయినా ఇప్పటి వరకు, 'న్యూస్ క్లిక్'పై ఎలాంటి నిర్దిష్టమైన ఆరోపణలను ప్రభుత్వం వెల్లడించలేదు. వెబ్‌సైట్ ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థను, మరొకరిని ఘోరమైన 'ఉపా' (చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం-యుఎపిఎ), ఇతర చట్టాల్లోని నిరంకుశ నిబంధనల కింద అరెస్టు చేయడానికి గల కారణమేంటో కూడా చెప్పలేకపోయింది. చైనాతో సంబంధాలు కలిగిన తీవ్రవాద కేసులో ఈ వెబ్‌సైట్‌పై దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే చైనా అనుకూల ప్రచారం లేదా తీవ్రవాద సంబంధాలు కలిగినట్లుగా సూచించే ఏ వ్యాసం లేదా సమాచారం ఇంతవరకు వెలుగులోకి రాలేదు. అలాగే తమకు ఇంతవరకు ఎఫ్‌ఐఆర్ కాపీని కూడా ఇవ్వలేదని వెబ్‌సైట్ యాజమాన్యం చెబుతోంది. తమపై మోపిన నేరాల వివరాలు కూడా తమకు తెలియచేయలేదని పేర్కొన్నారు. ఇంకా, 'న్యూస్ క్లిక్'తో సంబంధమున్న ఉద్యోగులు, కంట్రిబ్యూటర్ల నివాసాలపైనా దాడులు చేశారు. వారిలో చాలా మంది మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. వెబ్‌సైట్‌పై తీసుకున్న ఈ చర్యలేవీ కొత్తవేమీ కాదు. 2021 నుండి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి), ఆదాయ పన్ను శాఖల దాడులను, నిశిత పరిశీలనలను 'న్యూస్ క్లిక్' ఎదుర్కొంటూనే వుంది. ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కానీ ఇంతవరకు చార్జిషీట్ ఒక్కటి కూడా దాఖలు చేయలేదు. 'న్యూస్ క్లిక్'కు అనుకూలంగా ప్రాథమిక సాక్ష్యాధారాలు కలిగిన కేసులో ఢిల్లీ హైకోర్టు పుర్కాయస్థను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించింది. పైగా 'న్యూస్ క్లిక్' సంస్థపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ఇ.డి ని కూడా ఆదేశించింది. ఇదే విషయమై ఆదాయ పన్ను శాఖ దాఖలు చేసిన ఫిర్యాదును కూడా దిగువ కోర్టు తోసిపుచ్చింది.

'న్యూయార్క్ టైమ్స్'లో వచ్చిన ఒక వ్యాసం ఆధారంగా ప్రస్తుత వరుస దాడులు, చర్యలు చేపట్టారు. 'న్యూస్ క్లిక్'లో ఒక పెట్టుబడిదారుడి చర్యలను, ఉద్దేశ్యాలను ఆ వ్యాసం ప్రశ్నించింది. ఆ వ్యక్తికి చైనా ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు వున్నాయని ఆరోపించబడింది. కానీ భారత్‌కు వ్యతిరేకంగా అక్రమ ప్రచారాన్ని చేపట్టేలా ఆ వార్తా వెబ్‌సైట్‌లో ఎలాంటి నిర్దిష్ట వ్యాసాన్ని పేర్కొనలేదు. కేవలం 'న్యూయార్క్ టైమ్స్' వార్తా కథనం ఆధారంగానే ప్రభుత్వ ప్రతినిధులు ఈ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, ఒక పద్ధతి ప్రకారం దూషణలకు దిగడం వంటివి చేశారు. మీడియా సంస్థను బలిపశువును చేయడానికి, విమర్శనాత్మక జర్నలిజంపై ఒళ్ళు గగుర్పొడిచే రీతిలో చర్యలు చేపట్టడానికే మంగళవారం నాటి చర్యలు ఉద్దేశించినట్లు కనిపిస్తోంది. కేవలం సంస్థకు అందుతున్న నిధులపై అనుమానంతో ఏ ప్రభుత్వమైనా ఇంతలా జర్నలిస్టులను దారుణంగా లక్ష్యం చేసుకోరాదు, చేసుకోలేదు కూడా. తద్వారా రాజ్యాంగంలో హామీ కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను కూడా దెబ్బతీయరాదు. నిరంకుశమైన అంతర్గత భద్రతా చట్టం కింద 1975లో ఎమర్జన్సీ సమయంలో మోసపూరితమైన ఆరోపణలపై పుర్కాయస్థను అరెస్టు చేశారు. అప్పుడు ఆయన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో విద్యార్థి నాయకునిగా వున్నారు. ఈనాడు, అటువంటి ఎమర్జెన్సీ ఏదీ ప్రకటించకపోయినా చరిత్ర పునరావృతమైనట్లు కనిపిస్తోంది.

**/ 'హిందూ' సంపాదకీయం /**

విమర్శ

# చిన్న పరిశ్రమలను చిదిమేస్తున్నారు...



**ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రంగరాజన్ వివరించిన ప్రకారం దేశంలో బడా బాబులు చెల్లించాల్సిన మొత్తం 28 లక్షల కోట్ల రూపాయలు మొండి బకాయిలుగా మిగిలి పోయాయని చెప్పారు. వీరేగాక రూ. 5 వేల కోట్లు, అంతకన్నా తక్కువ బకాయిలు ఉన్నవాళ్లు అనేక మంది ఉన్నారు. ప్రజా ధనంతో లావాదేవీలు జరిపే ఈ బ్యాంకులు బడా పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులతో బంధం ఉన్న వారికి ఇన్ని లక్షల కోట్ల రూపాయలు ఎలా ఇస్తున్నారు? వాటిని వసూళ్ళు చేయలేక, కనీసం వారిని ప్రశ్నించటం కూడా చేతకాక ప్రజాధనాన్ని ప్రభుత్వం ఎలా మాఫీ చేస్తున్నది? సామాన్యుల విషయంలో బ్యాంకులు ప్రవర్తించే తీరు ఇలానే ఉంటుందా? రైతులు, కిరాణా వ్యాపారస్తులు, చిన్న పారిశ్రామికవేత్తలు తాము చెల్లించాల్సిన వాయిదాలు (కిస్తీలు) సక్రమంగా లేకపోతే విరుచుకుపడే బ్యాంకులు బడాబాబుల పారుబకాయిల విషయంలో ఎందుకు నోరు మెదపలేక పోతున్నాయి?**

ప్రతి రోజూ కనీసం పది నుంచి ఇరవై వరకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (ఎస్ఎంఇ) మూసివేస్తున్నట్టు లేదా వేలం వేస్తున్న ప్రకటనలు హిందూ పత్రికలో కనిపిస్తాయి. ఒక్క హిందూ దినపత్రిక దక్షిణ భారత ఎడిషన్‌లో నెలకు వెయ్యికి పైగా పరిశ్రమలకు ఉరితాడు వేస్తున్నట్టు బ్యాంకుల ప్రకటనలు కనిపిస్తాయి. మొత్తం ఆంగ్ల పత్రికలలో ప్రకటనలు లెక్కిస్తే ఈ సంఖ్య 2000కి తక్కువేమీ కాదు.

కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల (ఎస్ఎంఇ)కు తాము అందిస్తున్న సహకారం చాలా ఉందని, బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ ఫోటోతో పూర్తి పేజీ ప్రకటనలతో అప్పుడప్పుడు దేశంలోని అన్ని భాషలలో గొప్పగా చెబుతుంటుంది. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు (ఎస్ఎంఇ) తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు గొప్ప అవకాశం అంబుడ్స్‌మెన్ (మధ్యవర్తి) ఈ తరహా విధానమని, తక్షణ పరిష్కారానికి వినియోగించుకోవాలని రిజర్వు బ్యాంకు తరపున ప్రకటనలలో సారాంశంగా ఉంటుంది. పై ప్రకటనలలో వాగాడంబరం తప్ప చిన్న పరిశ్రమలు నెలకొల్పే వారికి ప్రోత్సాహకాలు ఏమీ లేవని తేలుతున్నది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక ఓ లెక్క ప్రకారం 60 లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతకు గురైనట్టు సమాచారం. పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ కారణంగా ఈ సంఖ్య తీవ్రంగా పెరిగింది. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా వీరికి ఒరిగింది ఏమీ లేదు. స్వయంకృషితో పది మందికి ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చి పరిశ్రమలు స్థాపిస్తున్న వారికి ప్రోత్సాహం కరువవుతున్నది.



**కందారపు మురళి**

ముఖ్యంగా బ్యాంకులు పెట్టిన నిబంధనలు సామాన్యులు ఎవరూ తట్టుకుని పరిశ్రమలు కొనసాగించేలా లేవు. సాధారణమైన పరిశ్రమల పరిస్థితి ఇలా ఉండగా కార్పొరేట్ కంపెనీలకు అధిపతులుగా ఉన్న అదానీ, అంబానీ లాంటి వారికి లక్షల కోట్ల రూపాయల రుణాలను ఉత్తి పుణ్యంగా రద్దు చేస్తున్నారు. 2018లో 'ఇక్రా' అనే ఏజన్సీ తయారు చేసిన గణాంకాల ప్రకారం 70 ఖాతాలకు చెందిన రూ.3.80 లక్షల కోట్లు ఎన్‌పిఏలుగా (నిరర్ధక ఆస్తులు) మారిపోయాయని ఇందులో ప్రధానంగా విద్యుత్, ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్, టెలికాం రంగాలకు చెందినవని పేర్కొన్నారు. ఈ 70 ఖాతాలలో 34 ఖాతాలు ఎలక్ట్రిసిటీ రంగానికి చెందినవని ఆ నివేదికలో ఉంది.

బ్యాంకులు తాము ఇచ్చిన రుణాలను ఆస్తులుగా పరిగణిస్తాయి. ఈ చెల్లింపులు కొంతకాలం ఆగిపోతే వాటిని నాన్ పెర్ఫామింగ్ అసెట్స్‌గా (నిరర్ధక ఆస్తులు) పేర్కొంటారు. భారత్‌లో ఉన్న నిబంధనల ప్రకారం రుణ చెల్లింపులు 90 రోజులపాటు పూర్తిగా కానీ, పాక్షికంగా గానీ జరపకపోతే ఆ రుణాలను ఎన్‌పిఏలుగా పరిగణిస్తారు.

మోడీ అధికారంలోకి వచ్చిన 2013-14 నుంచి 2022 డిసెంబర్ నాటికి ప్రభుత్వ, ప్రయివేటు విదేశీ బ్యాంకులకు రూ.12,09,606 కోట్ల నష్టం వాటిల్లిందని గణాంకాలు చెబుతున్నాయి. రుణాల ఎగవేతదారులకు మోడీ పాలన స్వర్గధామంలా తయారైంది. స్వతంత్ర భారత చరిత్రలో బ్యాంకులకు ఇంత పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లిన దాఖలాలు లేవు. నష్టాల తీవ్రతను తగ్గించి చూపటానికి బ్యాంకుల విలీనం నాటకం ప్రారంభించారు. మోడీ హయాంలో బ్యాంకులకు బకాయిలు రూ.67.66 లక్షల కోట్లకు చేరాయి. వీటిలో ప్రభుత్వరంగ బ్యాంకులవి రూ.54.33 లక్షల కోట్లు, మిగిలినవి ప్రయివేటు, విదేశీ బ్యాంకులవి. వీటిలో ఇప్పటికే రూ.12.10 లక్షల కోట్లను మొండి బకాయిలుగా ప్రకటించి రద్దు చేశారు. మోడీ అధికారంలోకి వచ్చాక గత తొమ్మిదేళ్లలో రూ.13.50 లక్షల కోట్ల రుణాలను రద్దు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2.09 లక్షల కోట్ల రుణాలను రద్దు చేశారు.

గత ఐదేళ్లలో బ్యాంకులు మాఫీ చేసిన రుణాల మొత్తం రూ.10.57 లక్షల కోట్లకు చేరిందని సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు ఆర్‌బిఐ సమాధానం చెప్పింది. గత పదేళ్లలో బ్యాంకులు రద్దు చేసిన మొండి బకాయిలు మొత్తం అక్షరాల రూ.15.5 లక్షల కోట్లు, గత మూడేళ్లలో బ్యాంకులకు బడాబాబులు ఎగవేసిన రుణాలు రూ.10.32 లక్షల కోట్లు. ఆర్‌బిఐ సమాచారం ప్రకారం గడిచిన మూడేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.3,66,380 కోట్ల రూపాయలను అంటే 62.45 శాతం రుణాలను రద్దు చేశాయి. ఉద్దేశ్యపూర్వకంగా ఎగవేసిన వారి రుణాలను రద్దు చేస్తున్నారు. అయితే బాగుపడదామని, సమాజానికి ఏదో చేద్దామని ముందుకు వచ్చిన చిన్న, మధ్య తరహా పరిశ్రమల వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకులకు వచ్చిన రూ.14,91,177 కోట్ల లాభాలను కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో కార్పొరేట్ కంపెనీలు కట్టాల్సిన మొండి బకాయిల స్థానంలోకి బ్యాంకులు తరలించాయి. నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ, నిశాంత్ మోడీ, అమి మోడీ వంటి బడా గుజరాతీ పారిశ్రామికవేత్తలు పంజాబ్ నేషనల్ బ్యాంక్, దాని అనుబంధ సంస్థల నుంచి రూ.11,400 కోట్లు దోచుకున్నా ఎవరూ నోరు మెదపటం లేదు. వీరందరూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి సన్నిహితులే.

ప్రధానికి అతి సన్నిహితుడైన జతిన్ మెహతా 2014 లోనే కుటుంబంతో కలసి దేశం విడిచి పరారయ్యాడు. మెహతా యాజమాన్యం లోని విన్‌సన్ డైమండ్స్ సంస్థ బ్యాంకులకు రూ.7 వేల కోట్లు ఎగవేసింది. గుజరాత్‌కు చెందిన ఫార్మా కంపెనీ స్టెర్లింగ్ బయోటెక్ లిమిటెడ్ సైతం రూ.8100 కోట్లు ఎగనామం పెట్టింది. వీరందరూ మోడీతో తమకున్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించుకుని బ్యాంకులకు టోకరా వేశారు. రిషి కమలేష్ యాజమాన్యంలోని ఎ.బి.జి షిప్ యార్డ్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థ బ్యాంకుల నుంచి రూ.22,842 కోట్లు కొల్లగొట్టాయి. ఇలాంటి వ్యక్తులు సంస్థలు ఈ తొమ్మిదేళ్లలో అనేకం.

ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రంగరాజన్ వివరించిన ప్రకారం దేశంలో బడా బాబులు చెల్లించాల్సిన మొత్తం 28 లక్షల కోట్ల రూపాయలు మొండి బకాయిలుగా మిగిలి పోయాయని చెప్పారు. ఇందులో పేరుగాంచిన వారు ఇలా (పట్టిక) ఉన్నారు.

వీరేగాక రూ.5 వేల కోట్లు, అంతకన్నా తక్కువ బకాయిలు ఉన్నవాళ్లు అనేక మంది ఉన్నారు. వీరంతా సొంత విమానాలతో దేశంలో దర్జాగా జీవిస్తున్నారు. ప్రజాధనంతో లావాదేవీలు జరిపే ఈ బ్యాంకులు బడా పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులతో బంధం ఉన్న వారికి ఇన్ని లక్షల కోట్ల రూపాయలు ఎలా ఇస్తున్నారు? వాటిని వసూళ్ళు చేయలేక, కనీసం వారిని ప్రశ్నించటం కూడా చేతకాక ప్రజాధనాన్ని ప్రభుత్వం ఎలా మాఫీ చేస్తున్నది? సామాన్యుల విషయంలో బ్యాంకులు ప్రవర్తించే తీరు ఇలానే ఉంటుందా? ముమ్మాటికి కాదు! చంద్రయాన్ లాంచ్ పాడ్ ఇంజనీరు క్రెడిట్ కార్డు ద్వారా తీసుకున్న రుణం చెల్లించటానికి జీతం లేక ఉద్యోగం వదలి 'ఇడ్లీ'లు అమ్మి రుణం తీరుస్తున్నారు. రైతులు, కిరాణా వ్యాపారస్తులు, చిన్న పారిశ్రామికవేత్తలు తాము చెల్లించాల్సిన వాయిదాలు (కిస్తీలు) సక్రమంగా లేకపోతే విరుచుకుపడే బ్యాంకులు బడాబాబుల పారుబకాయిల విషయంలో ఎందుకు నోరు మెదపలేకపోతున్నాయి? ఇదంతా నాణానికి ఒకవైపు. మరోవైపు ఎలా ఉందో చూద్దాం.

ఏదో ఉద్ధరిద్దామని చిన్నా, చితకా పరిశ్రమలు పెట్టి చేతులు కాల్చుకుని ఆ సంక్షోభ చట్రం నుంచి బయటపడలేక అల్లాడిపోతున్న జీవితాలు లక్షల సంఖ్యలో ఉన్నాయి. భర్త తీసుకున్న రుణం భర్త కాలం అయిన తర్వాత భార్య చెల్లించలేకపోతే బ్యాంకులు పెడుతున్న ఇబ్బందులు, తాతముత్తాతలు తీసుకున్న రుణానికి మనవళ్లు, వారి ముని మనవళ్లు కోర్టుల చుట్టూ తిరుగుతూ మానసిక క్షోభకు గురవుతున్న ఘటనలు కోకొల్లలు. 'కాఫీ డే'కి అంతర్జాతీయ ప్రతిష్టను ఆర్జించి పెట్టిన వి.జి సిద్ధార్ధ హెగ్డే తన బలవన్మరణానికి కారణం తీవ్రమైన ఒత్తిడి, బ్యూరోక్రసీ వేధింపులే కారణమని లేఖ రాసినా, ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు లేవు.

తిరుపతికి చెందిన ఒ.వి.రమణ అనే మధ్యతరహా పారిశ్రామికవేత్త ఫ్యాక్టరీని, ఎంతో ప్రేమతో కట్టుకున్న ఇంటిని, ఆస్తులను పోగొట్టుకుని బ్యాంకులపై చేస్తున్న పోరాటం ఎంతో ఆశ్చర్యాన్ని, ఆసక్తిని కలిగిస్తుంది. 2019లో మోడీ ప్రకటించిన ఎన్‌సిఎల్‌టి పథకం కూడా అందులో భాగమేనని, అంబుడ్స్‌మెన్ పథకం (అమితాబ్ ప్రకటన) వట్టి బూటకమని ఏ ఒక్కరి సమస్యను పరిష్కరించలేదని ఆయన అంటున్నారు. 2016వ సంవత్సరం నుంచి నేటి వరకూ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నానని, చెయ్యని నేరానికి బ్యాంకులు సామాన్యుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు తాను నిదర్శనమని తనలాంటి వాళ్లు రోజుకు కనీసం వెయ్యి మంది ఇబ్బందులకు గురవుతున్నారని, వీరి సమస్యలను పాలకులు పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అందరిలా తాను ఉండకూడదని, గతంలో ఎన్నడూ లేని విధంగా బ్యాంక్ అధికారుల తీరును నిశితంగా కోర్టులకు వివరించానని, వారిపై ఎదురు కేసులు పెట్టానని ప్రస్తుతం బ్యాంకు యాజమాన్యంపై ఎఫ్‌ఐఆర్ అయిందని, ఇది దేశ చరిత్రలో మొదటి కేసుగా ఆయన అభివర్ణించారు. బాధితుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు బ్యాంకులు పాల్పడ్డాయని, తన లాంటి వాళ్లపై సాగుతున్న బ్యాంకుల దాష్టీకాలపై న్యాయం జరిగేంత వరకు తన పోరు సాగుతుందని ఒ.వి.రమణ అంటున్నారు.

ఇదీ మోడీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి.

**/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు,**
**సెల్ : 9490098840 /**

**బడాబాబులు-మొండి బకాయిలు (రూ. కోట్లలో)**

| | | |
|---|---|---|
| ముఖేష్ అంబానీ | - | 1,87,070 |
| అనిల్ అంబానీ | - | 1,24,956 |
| రూలియా బ్రదర్స్ | - | 1,01,461 |
| అనిల్ అగర్వాల్ | - | 1,03,340 |
| గౌతమ్ అదానీ | - | 96,031 |
| సైరస్ మిస్త్రీ | - | 80,701 |
| మనోజ్ గౌర్ | - | 75,163 |
| సజ్జన్ జిందాల్ | - | 58,171 |
| ల్యాంకో మధు | - | 47,102 |
| వి.ఎన్.ధూప్ | - | 45,400 |
| జి.వి.కె రెడ్డి | - | 33,933 |

# కదంతొక్కిన మహిళాలోకం

చలో ఢిల్లీ కార్యక్రమానికి దేశ నలుమూలల నుంచీ మహిళాలోకం తరలివచ్చింది.



ర్యాలీకి అగ్రభాగాన ఐద్వా జాతీయ నేతలు సుభాషిణీ అలీ, మరియం ధావలే, పికె శ్రీమతి తదితరులు



సంఘీభావం తెలుపుతున్న బి.వెంకట్, అశోక్‌ధావలే


సభలో అభివాదం చేస్తున్న మహిళా నేతలు


ఆందోళనలో పాల్గొన్న శైలజ టీచర్ తదితరులు

## పశ్చిమ బెంగాల్ మంత్రి నివాసంపై ఇడి దాడి


**కోల్‌కతా, బెంగళూరు :** పశ్చిమబెంగాల్ ఆహార శాఖ మంత్రి రతిన్‌ఘోష్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాడులు చేసింది. మధ్యంగ్రామ్ మున్సిపాలిటీలో రిక్రూట్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి మంత్రి నివాసంలో గురువారం ఉదయం నుంచి ఇడి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా కోల్‌కతాలోని మంత్రి నివాసంతో పాటు 13 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. గతంలో రతిన్ ఘోష్.. మధ్యంగ్రామ్ మున్సిపాలిటీ చైర్మన్‌గా పనిచేశారు. ఆ సమయంలో పెద్దసంఖ్యలో అనర్హులకు ఉద్యోగాలు ఇప్పించినట్లు ఇడి పేర్కొంది. ఘోష్, ఆయన సహచరులు అభ్యర్థుల నుంచి లంచం తీసుకున్నారనే ఆరోపణలపై ఈడి విచారణ చేపడుతోంది. ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని అధికారులు తెలిపారు.





# ఇది ప్రజాస్వామ్యంపై దాడి !

## న్యూస్‌క్లిక్‌పై దాడులను ఖండిస్తూ రచయితలు, కార్యకర్తల ప్రకటన


అరుణా రాయ్, గీతాంజలి శ్రీ, కె.ఆర్.మీరా, పి.సాయినాథ్ (పై వరుసలో)
వి.గీత , టి.ఎం.కృష్ణ, రామచంద్ర గుహ, పెరుమాళ్ మురుగన్ ( కింద వరుసలో)

**న్యూఢిల్లీ :** న్యూస్‌క్లిక్ కార్యాలయాలు, జర్నలిస్టులపై జరిగిన దాడిని ఖండిస్తూ ప్రముఖ రచయితలు, కార్యకర్తలు ఒక ప్రకటన చేశారు. అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ గ్రహీత గీతాంజలి శ్రీ, రామన్ మెగసెసె అవార్డు గ్రహీతలు పి.సాయినాథ్, అరుణా రాయ్, రచయితలు కె.ఆర్.మీరా, పెరుమాళ్ మురుగన్, రామచంద్ర గుహ, వి.గీత, గాయకులు టి.ఎం.కృష్ణలు ఢిల్లీ పోలీసుల చర్యను ఖండిస్తూ ఈ ప్రకటనపై సంతకాలు చేశారు. అధికారంలో వున్నవారితో నిజాన్ని నిర్భయంగా చెప్పే జర్నలిస్టులను ప్రభుత్వం వేధిస్తోందని, దూషణలకు గురి చేస్తోందని ఆ ప్రకటనలో వారు పేర్కొన్నారు. ధైర్య సాహసాలతో పనిచేసే జర్నలిస్టుల గొంతు నులిమివేసేందుకు ఒళ్ళు గగుర్పొడిచే రీతిలో ప్రభుత్వం ఈ రీతిన దాడులకు పాల్పడిందని వారు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో విమర్శ అనేది చాలా అవసరమైనది. ఆ విమర్శకుల నోళ్ళు మూయించడానికి చేసే ఏ ప్రయత్నమైనా అది భారతదేశ ప్రజాస్వామ్య స్ఫూర్తిపైనే దాడి చేసినట్టే అవుతుందని వారు పేర్కొన్నారు. ఈ నెల 3న న్యూస్‌క్లిక్‌లో పనిచేసే దాదాపు 46మంది ఇళ్ళపై ఢిల్లీ పోలీసులు దాడి చేశారు. వీరిలో చాలామందిని అదుపులోకి తీసుకున్నారని, వారిలో చాలామంది ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారని ఆ ప్రకటన పేర్కొంది. ఇది వారి గోప్యతా హక్కును ఉల్లంఘించడమే కాకుండా, కోర్టు ఆదేశాలు లేకుండా వారి ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకోవడం అక్రమమని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. యుఎపిఎ కింద గతంలో ఇలా అదుపులోకి తీసుకున్నవారి ఫోన్లలో, ల్యాప్‌టాప్‌ల్లో దురుద్దేశపూరితంగా కొన్ని సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టిన ఉదంతాలు విన్నామని, తాజా కేసులో న్యూస్ క్లిక్ జర్నలిస్టులపై కూడా ఇటువంటి ప్రయత్నాలు జరిగే అవకాశాలు వున్నాయని ఆందోళన చెందుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ రకంగా న్యూస్‌క్లిక్ జర్నలిస్టులు, కంట్రిబ్యూటర్లపై జరిగే వేధింపులకు వ్యతిరేకంగా గళం వినిపించాల్సిందిగా ప్రజలను కోరారు. ఈ తరుణంలో జర్నలిజంలో న్యూస్‌క్లిక్ చేసిన అద్భుతమైన కృషిని అభినందిస్తూ, వారి సిబ్బందికి పూర్తి సంఘీభావాన్ని తెలియచేస్తున్నామని వారు పేర్కొన్నారు.

**ఇఇఎఫ్ఐ ఖండన**

పత్రికలు, ప్రజాస్వామ్యంపై జరిగిన ఆటవిక దాడిని ఇఇఎఫ్ఐ (ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సమాఖ్య) ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. భావ ప్రకటనా స్వేచ్ఛపై జరుగుతున్న ఈ దాడిని ఖండిస్తూ నిరసనలు తెలియచేయాల్సిందిగా ఇంధన రంగం లోని ఇతర సంస్థలకు, ప్రజలకు పిలుపునిచ్చింది.

# ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వండి

- ఢిల్లీ పోలీసులకు కోర్టు ఆదేశం




**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

యుఎపిఎ కింద అరెస్టయిన న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థా, హెచ్ఆర్ మేనేజర్ అమిత్ చక్రవర్తికి ఎఫ్ఐఆర్ కాపీని అందించాలని ఢిల్లీ పోలీసులను ఢిల్లీ కోర్టు ఆదేశించింది. ఈ దశలో ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వలేమన్న ఢిల్లీ పోలీసుల వాదనను అదనపు సెషన్స్ జడ్జి హర్దీప్ కౌర్ తోసిపుచ్చారు. అదే సమయంలో ఈ కేసులో మరింత మందిని అరెస్టు చేసే చర్యలో భాగంగా ఢిల్లీ పోలీసులు సీనియర్ జర్నలిస్టులు పరంజోయ్ గుహా ఠాకుర్తా, అభిసార్ శర్మలను విచారణకు హాజరుకావాలని మళ్లీ సమన్లు పంపారు. ఎఫ్ఐఆర్ కాపీని అందజేయడాన్ని వీలైనంత వరకు పొడిగించాలని ఢిల్లీ పోలీసులు చేసిన ప్రయత్నం కోర్టు జోక్యంతో విఫలమైంది. కాపీని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను గురువారం ఢిల్లీ కోర్టు విచారించింది. ఢిల్లీ పోలీసుల తరపున హాజరైన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాస్తవ.. ఈ దశలో కాపీని ఇవ్వలేమని వాదించారు. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం, నిందితులు మొదట కాపీ కోసం కమిషనర్‌ను సంప్రదించాలని, ఆ తరువాత డిమాండ్‌ను పరిశీలించేందుకు కమిటీ వేయాలని అన్నారు. ప్రస్తుత దశలో అటువంటి అభ్యర్థనను కోర్టు స్వీకరించొద్దని, అరెస్టుకు దారితీసిన పరిస్థితులు, ఇతరులను రిమాండ్ దరఖాస్తులో పేర్కొనడం జరిగిందని శ్రీవాస్తవ తెలిపారు. ఎఫ్ఐఆర్ కాపీని పొందేందుకు ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేవని ప్రబీర్ తరపు న్యాయవాది అర్షదీప్ సింగ్ ఖురానా అన్నారు. అంతేకాదు, అరెస్టుకు గల కారణాలను కూడా లిఖితపూర్వకంగా అందజేయాలని న్యాయవాది పోలీసులను కోరారు. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు కాపీని అందజేయాలని ఆదేశించింది. ప్రబీర్, అమిత్ ప్రస్తుతం వారం రోజుల పాటు పోలీసుల కస్టడీలో ఉన్నారు.

**సీనియర్ జర్నలిస్టులకు సమన్లు**

మరోసారి విచారణకు హాజరు కావాలని సీనియర్ జర్నలిస్టులు పరంజోయ్ గుహా ఠాకుర్తా, అభిసార్ శర్మలకు పోలీసులు గురువారం సమన్లు జారీ చేశారు. ఈ కేసులో మంగళవారం 46 మందిని ప్రశ్నించారు. ప్రశ్నలను ఎ, బి, సి అనే మూడు జాబితాలుగా విభజించారు. అరెస్టు చేయవలసిన వారిని జాబితా ఎ చేర్చింది. ప్రబీర్, అమిత్‌లతో పాటు ఈ జాబితాలో మరో నలుగురు ఉన్నారని కథనాలు వచ్చాయి. ఠాకుర్తా, అభిసార్‌లను అరెస్టు చేయడానికే మళ్లీ సమన్లు జారీ చేశారన్న చర్చ జరుగుతుంది.

**పూర్తిగా నిరాధార ఆరోపణలు**

న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్ఆర్ మేనేజర్ అమిత్ చక్రవర్తిలను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ చేసిన రిమాండ్ రిపోర్టులోనూ, యుఎపిఎ కింద నమోదైన ఎఫ్ఐఆర్‌లోనూ ఢిల్లీ పోలీసులు పూర్తిగా నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. మహారాష్ట్రలోని భీమా కోరేగావ్ కేసులో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్క్సిస్ట్ ఆలోచనాపరుడు, జర్నలిస్టు గౌతమ్ నవ్‌లాఖాతో ప్రబీర్ పుర్కాయస్థ స్నేహాన్ని 'తీవ్రమైన' నేరంగా ఢిల్లీ పోలీసులు అభివర్ణించారు. కాశ్మీర్ కాకుండా భారతదేశాన్ని ఎలా మ్యాప్ చేయాలని, అరుణాచల్‌ను వివాదాస్పద ప్రాంతంగా ఎలా చిత్రీకరించాలని 'చర్చించారు' అని ఢిల్లీ పోలీసులు విపరీతమైన వాదనలు కూడా చేస్తున్నారు.

న్యూస్‌క్లిక్‌పై ఆరోపణలు గాలి బుడగల్లా తేలిపోతున్నాయని దర్యాప్తు అధికారులే గుసగుసలాడుకుంటున్నారు. యుఎపిఎ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ కాపీని అందజేయడానికి పోలీసులు విముఖత చూపడానికి కూడా ఇదే కారణం. నిజానికి 2021లో న్యూస్‌క్లిక్‌పై ఈడీ కేసులో ఆరోపణలతో పాటు, గౌతమ్ నవ్‌లాఖాతో స్నేహం, కాశ్మీర్, అరుణాచల్ సమస్యలపై ఢిల్లీ పోలీసులు చెప్పవల్సి ఉంది. కానీ ఎఫ్ఐఆర్‌లో లేదా రిమాండ్ దరఖాస్తులో దీనిని ధ్రువీకరించే ఎలాంటి ఆధారాలు పేర్కొనలేదు. ఎఫ్ఐఆర్ ప్రకారం, న్యూస్‌క్లిక్ 2018 నుండి యుఎస్ వ్యాపారవేత్త నెవిల్లే రాయ్ సింఘమ్‌తో లింక్ చేయబడిన మూడు సంస్థల నుండి నిధులు అందాయని, వాటితో చైనా అనుకూల ప్రచారం చేస్తోందని, 1991 నుండి నవ్‌లాఖాతో ప్రబీర్ స్నేహం గురించి ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించినట్లు లీకైన వార్తలొస్తున్నాయి. న్యూస్‌క్లిక్‌పై ఎఫ్ఐఆర్ ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు ఆధారంగా రూపొందించారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను దెబ్బతీసేందుకు కోట్లాది విదేశీ నిధులు అక్రమంగా భారత్‌లోకి వస్తున్నాయని ఢిల్లీ పోలీసులకు నిఘా ఉందని రిమాండ్ దరఖాస్తులో పేర్కొన్నారు.

## బెదిరించేందుకే ఈ దాడులు !

- సింగమ్ అటువంటి వ్యక్తి కాదు
- 'ది వైర్' ఇంటర్వ్యూలో ఎన్ రామ్



**న్యూఢిల్లీ :** జర్నలిస్టులపై దాడులు విషపూరితమైనవని, ఈ దాడుల్లో ఇమిడివున్న ప్రభుత్వ సంస్థలన్నీ కూడా పంజరంలో చిలుకల వంటివని 'ది హిందూ' పత్రిక మాజీ సంపాదకులు, ప్రచురణకర్త ఎన్.రామ్ విమర్శించారు. జర్నలిస్టులను బెదిరించడానికి వేటాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఐదు నగరాల్లో న్యూస్‌క్లిక్ కార్యాలయాలు, 50మంది సిబ్బంది నివాసాలపై జరిగిన పోలీసు దాడులు, వారిపై మోపిన అభియోగాలు, ఆరోపణలు గురించి ఆయన ఆన్‌లైన్ వెబ్‌సైట్ 'దివైర్'కిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. నెవిల్లె రాయ్ సింగమ్ నుండి న్యూస్‌క్లిక్ నిధులు అందుకుంటోందని, ఆ నిదులను భారత్ భద్రతకు ముప్పు కలిగించేలా అది ఉపయోగిస్తున్నదని ఢిల్లీ పోలీసులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని రామ్ చెప్పారు. సింగమ్ తనకు తెలుసునని, ఆయన వామపక్షాలకు మద్దతుదారుగా వుంటారని, అయినా కూడా ఆయన చైనా ప్రచారానికి లేదా చైనా నిధులకు ఒక వాహకంగా లేరని రామ్ స్పష్టం చేశారు. న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని బాధ్యతారాహిత్యమైనదిగా, సోమరితనంతో కూడిన జర్నలిజంగా ఆయన అభివర్ణించారు. అసలు సింగమ్ ఎవరు, గార్డియన్ పత్రిక కోసం ఆయన చేసిన కృషి ఏంటి, ఆయన డబ్బు ఎలా సంపాదించారు, వాటిని మంచి పనుల కోసం ఎలా ఉపయోగిస్తున్నారనేది రామ్ వివరంగా చెప్పారు. జర్నలిస్టుల పట్ల మోడీ ప్రభుత్వ వైఖరి ఎమర్జన్సీని తలపిస్తోందని ఆయన విమర్శించారు. న్యూస్‌క్లిక్‌పై దాడిని నిరసిస్తూ బుధవారం ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద జరిగిన ఆందోళనల్లో ప్రధాన వార్తాపత్రికలకు లేదా ప్రధాన వార్తా చానెళ్లకు సంబంధించిన ఏ సంపాదకులు లేకపోవడం విచారకరమని అన్నారు.





## న్యూస్‌క్లిక్‌పై ఆరోపణలు హాస్యాస్పదం : సంజయ్ బారు



**న్యూఢిల్లీ:** 46 మంది జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు ఎమర్జెన్సీని తలపిస్తున్నాయని బిజినెస్ స్టాండర్డ్ మాజీ ఎడిటర్, ప్రధాని మాజీ సలహాదారు సంజయ్ బారు వ్యాఖ్యానించారు. న్యూస్‌క్లిక్‌పై ఆరోపణలు చాలా హాస్యాస్పదంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ ఆపరేషన్ స్థాయి పోలీసుల అసమర్థతకు చిహ్నమన్నారు. రైతుల నిరసనలు, పౌరసత్వ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలు, ఢిల్లీ అల్లర్లు వంటి ఘటనలను కవర్ చేశారా అని విలేకరులను అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జర్నలిస్టులు ఉన్నది అటువంటి పరిణామాలను కవర్ చేయడానికేనన్న స్పృహ వుండేవారెవరైనా ఇటువంటి ప్రశ్నలు అడుగుతారా అని ఆయన అన్నారు. న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తిపై వచ్చిన ఆరోపణలు నవ్వుపుట్టించేవిగా ఉన్నాయని సంజయ్ బారు వ్యాఖ్యానించారు.

## నోర్మూసుకుంటారా? జైలుకెళ్తారా?

- ట్రంప్‌ను హెచ్చరించిన న్యాయమూర్తి

**న్యూయార్క్:** ఎట్టకేలకు డొనాల్డ్ ట్రంప్‌ను నోర్మూసుకోమని ఓ కోర్టు జడ్డి ఆదేశించారు. ట్రంప్‌పై వచ్చిన మోసం అభియోగాలను విచారిస్తున్న న్యూయార్క్ స్టేట్ కోర్టు న్యాయమూర్తి ఆర్దర్ ఎంగోరాన్ అమెరికా మాజీ అధ్యక్షుడి నోటి దురుసుతనంపై ఫైర్ అయ్యారు. కోర్టు సిబ్బంది సభ్యులపై వ్యక్తిగత దాడులు ఎంతమాత్రం సహించేది లేదని అన్నారు. ట్రంప్ అంతకుముందు కోర్టు క్లర్క్ అల్లిసన్ గ్రీన్‌ఫీల్డును 'గర్ల్ ఫ్రెండ్' అని ఓ ట్వీట్‌లో ఎద్దేవా చేశాడు. దీనిపై సీరియస్ అయిన న్యాయమూర్తి ట్రంప్ తరపు న్యాయవాదులనుద్దేశించి, 'ఇలాంటి పరువు నష్టం వ్యాఖ్యలు చేసినందుకు జరిమానా, 30 రోజుల పాటు జైలు శిక్ష విధించవచ్చు. ఆయన (ట్రంప్) నోర్మూసుకుంటారా? లేక జైలుకు వెళ్తారా? చెప్పండి' అని మందలించారు. కోర్టు వెలుపల పరువు నష్టం కలిగించే ప్రకటనలు చేసి కేసును పక్కదారి పట్టించే చర్యలు ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కావని న్యాయమూర్తి పేర్కొన్నారు.

## నేపాల్‌గంజ్‌లో మతఘర్షణలు

**ఖాట్మాండు :** నేపాల్‌లోని నేపాల్‌గంజ్ పట్టణంలో మతఘర్షణలు చెలరేగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అధికారులు పట్టణంలో లాక్‌డౌన్ విధించి భద్రతను కట్టుదిట్టం చేశారు. ముస్లిములను కించపరుస్తూ సోషల్ మీడియాలో ఓ బాలుడు పోస్టుపెట్టడంతో ఈ ఘర్షణలు ప్రారంభమయ్యాయి. దీంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి నిరవధిక కర్ఫ్యూ అమల్లోకి తెచ్చారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారని, లాక్‌డౌన్ సమయంలో ప్రజలు తమ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, గుంపులు గుంపులుగా తిరగడానికి అనుమతించరని పోలీస్ అధికారి సంతోష్ రాథోడ్ తెలిపారు.

## బిజెపి, ఆర్ఎస్ఎస్ హటావో

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. దేశం నలుమూలల నుంచి కదలివచ్చిన మహిళలు కదనోత్సాహంతో ర్యాలీలో పాల్గొన్నారు. మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, మహిళా వ్యతిరేక, విద్వేష రాజకీయాలతో ప్రజలు విసిగిపోయారని వారు పేర్కొన్నారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ఐద్వా ఉపాధ్యక్షురాలు సుభాషిణి అలీ, మాలినీ భట్టాచార్య, సుధా సుందరరామన్, కెకె శైలజ టీచర్, కోశాధికారి ఎస్.పుణ్యవతి, కేరళ రాష్ట్ర కార్యదర్శి సిఎస్ సుజాత, బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి కననైనికా ఘోష్, త్రిపుర రాష్ట్ర అధ్యక్షురాలు రమణి దేవ్‌వర్మ తదితరులు మాట్లాడారు. ఈ ర్యాలీకి ఎఐకెఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే, సిఐటియు అఖిల భారత కార్యదర్శి ఎఆర్ సింధు, డివైఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమఘ్నరాజ్ భట్టాచార్య, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ , ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను, సిపిఐ (ఎం) ఎంపీలు వి.శివదాసన్, ఎఎ రహీమ్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి, ఏపి నుంచి సత్యవతి, రమణి, పూర్ణ, శ్రీదేవి, ప్రియాంక, మస్తాన్‌బి పాల్గొన్నారు. తొలుత జన నాట్య మంచ్ కళాకారులు ఆలపించిన గీతాలు ఆలోచింపజేశాయి.

"బుడి బుడి నడల తప్పటడుగులే తరగని మాన్యాలు ... చిట్టి పొట్టి పలుకుల ముద్దు మాటలే మా ధనధాన్యాలు.. ఎదగాలీ, ఇంతకు ఇంతై ఈ పసికూన..' తమ బిడ్డ ఎదుగుతున్నప్పుడు ప్రతి అమ్మానాన్న పొందే భావన ఇది. కొందరైతే- పిల్లలు బోర్లా పడితే బొబ్బట్లు, కూర్చుంటే కాజాలు, అడుగులు వేస్తే అరిసెలు ... అంటూ బిడ్డ ఎదుగుదలలోని ప్రతి దశనూ పండగలా జరుపుకుంటారు. అయితే, పిల్లల్లో వయసుకు తగ్గట్టుగా శారీరకంగా లేదా మానసికంగా ఎదుగుదల లేకపోతే - ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. పిల్లల్లో ఎదుగుదల లోపానికి ఉన్న కారణాల్లో సెరిబ్రల్ పాల్సీ ఒకటి. ప్రతి వెయ్యి మంది పిల్లల్లో ముగ్గురు ఈ సమస్యతో బాధపడుతున్నారు. దీనిపై అందరికీ అవగాహన కల్పించటానికి ఏటా అక్టోబరు 6న ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ అవగాహనా దినం జరపాలని సెరిబ్రల్ పాల్సీ అలియన్స్ (ఆస్ట్రేలియా), యునైటెడ్ సెరిబ్రల్ పాల్సీ అసోసియేషన్ (అమెరికా) 2012లో పిలుపునిచ్చాయి. సెరిబ్రల్ పాల్సీ పట్ల ప్రజలకు అవగాహన కలిగించడం, ఆ సమస్యతో ఉన్న వారికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించడం; వారిని సమాజంలో సమ్మిళితం చేయడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం.

# నేర్పిస్తే నేర్చుకుంటారు ...





### సెరిబ్రల్ పాల్సీ అంటే ...

సెరిబ్రమ్ అంటే మెదడు. పాల్సీ అంటే పక్షవాతం. సాధారణంగా మన శరీరంలో కండరాల కదలికలు, వాటి నియంత్రణ అంతా మన మెదడు నుంచి వచ్చే సంకేతాల ద్వారా జరుగుతుంది. అయితే, కొంతమంది పిల్లల్లో వివిధ కారణాలతో మెదడు దెబ్బతినడం వల్ల శరీర కండరాల మీద నియంత్రణ, కదలికల మధ్య సమన్వయం లోపిస్తుంది. దీనివల్ల కండరాలు బిగుసుకుపోవడం, కదల్లేకపోవడం, నియంత్రణ లేకుండా ఎక్కువగా కదలికలు చేయడం వంటివి జరుగుతాయి.

### కారణాలు అనేకం..

**బిడ్డ గర్భంలో ఉన్నప్పుడు.. :** తల్లికి జ్వరంగానీ, టెటనస్, రుబెల్లా లాంటి తీవ్రమైన ఇన్ఫెక్షన్లు రావడం, రక్తహీనత, షుగర్ నియంత్రణలో లేకపోవడం, అధిక రక్తపోటు ఉండడం.

- గర్భిణీ అధికంగా పొగాకు, ఆల్కహాల్ తీసుకోవడం.

**ప్రసవ సమయంలో.. :** నెలలు నిండకుండా పుట్టడం (28 వారాలు)

- తక్కువ బరువుతో పుట్టడం
- గర్భంలో ఉన్నప్పుడు ఉమ్మనీరు తాగడం, లేదా మలవిసర్జన చేయడం
- ప్రసవం క్లిష్టమై మెదడుకు ఆక్సిజన్ సరిగా అందకపోవడం

**ప్రసవం తరువాత..**

- తీవ్రమైన కామెర్లు, మెదడువాపు, ఇతర ఇన్ఫెక్షన్లు రావడం,
- రక్తంలో గ్లూకోజ్ స్థాయి తగ్గిపోవడం.

వీటితో పాటు జన్యుపరమైన కారణాలు కూడా ఉంటాయి.

### అపోహలు - నిజాలు

**సెరిబ్రల్ పాల్సీ ఉన్న పిల్లలు పిచ్చివారు ..X**

✓ గతంలో మన సమాజంలో ఈ విధమైన వైకల్యం ఉన్నవారిని పిచ్చివారిగా చూసేవారు. కానీ, అది అపోహ మాత్రమే! సి.పి ఉన్న చాలామంది పిల్లల్లో మానసిక ఎదుగుదల బాగానే ఉంటుంది. సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా మన దేశంలోనే ఎంతోమంది ఉన్నత చదువులు చదువుకుని అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

ఉదాహరణకు గురుగ్రాంలో శ్రియాభట్ 94 శాతం మార్కులు సాధించారు. హర్యానాలో కర్నల్ జిల్లాలో డాక్టర్ రితేష్ సిన్హా వీల్ చైర్‌కే పరిమితమైనా వేల మందికి కంప్యూటర్ పరిచయం చేశారు. సిపి అంటే సెరిబ్రల్‌పాల్స్ కాదని, 'కాపబుల్ పర్సన్' అని సరికొత్తగా నిర్వచించి అనేక మందిలో స్ఫూర్తి నింపారు.

**ఈ సమస్య వయసుతోపాటు పెరుగుతుంది! X**

✓ సి.పి అనేది వ్యాధి కాదు. ఇది కొన్ని లక్షణాల సముదాయం. సాధారణంగా ఐదేళ్లలోపే ఈ లక్షణాల వల్ల పిల్లల్లో కండరాలు బిగుసుకుపోతాయి. సరైన సమయంలో థెరపీ, సర్జరీ చేయకపోవటంతో కదలికలు తగ్గిపోతాయి తప్ప వయస్సు పెరుగుతుంటే లక్షణాలు ఎక్కువవడం ఉండదు.

**ఇలాంటి పిల్లలు స్వతంత్రంగా జీవితం సాగించలేరు X**

✓ ఇది కూడా పొరపాటు అభిప్రాయం. సెరిబ్రల్ పాల్సీ ఉన్న పిల్లలను చిన్న వయసు నుంచి సరైన పద్ధతిలో ట్రైన్ చేయాలి. సహాయ పరికరాలు అందించాలి. అప్పుడు వారు ఎవరి మీదా ఆధారపడకుండా స్వతంత్రంగా జీవనం సాగిస్తారు.

### సెరిబ్రల్ పాల్సీ టెక్నాలజీ

ఒకప్పుడు మంచానికో, వీల్ చైర్‌కో పరిమితమైన సి.పి పిల్లలకు ఇప్పుడు టెక్నాలజీ చాలా రకాలుగా ఉపయోగపడుతుంది. మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ళ తన కుమారుడు పుట్టిన తర్వాతే – తనకు ఇతరులు, సహోద్యోగులు, అంగ వైకల్యం ఉన్న వారి పట్ల దయ కలిగి ఉండటాన్ని నేర్పిందని, అదే కొత్త పరికరాల ఆవిష్కరణకు దోహదపడిందని తన హిట్ రిఫ్రెష్ పుస్తకంలో పేర్కొన్నారు. వికలాంగులకు ఉపయోగపడే ఆవిష్కరణల కోసం ఇన్‌క్లూసివ్ టెక్ ల్యాబ్ నెలకొల్పారు.



సెరిబ్రల్ పాల్సీ ఉన్న వారు కంప్యూటర్ వాడటానికి వీలుగా వారి చేతిలో పట్టుకునే విధానాన్ని బట్టి త్రీడీ ప్రింటింగ్‌లో మౌస్ తయారు చేశారు. ఇంకా కృత్రిమమేధ సహాయంతో టెక్స్ట్‌ఆడియో, స్పీచ్ టు టెక్స్ట్, అలానే మనకు ఎదురుగా ఉన్న వాటి గురించి వివరించే స్మార్ట్ కళ్ళజోడు వంటి పరికరాలను వివిధ కంపెనీలు ఇప్పటికే అందుబాటులో ఉంచాయి.

### ఎడాప్టర్ డివైసెస్

ఇతరుల మీద ఆధారపడకుండా వారు పట్టుకోవటానికి వీలుగా బ్రష్, దువ్వెన, పెన్ను, కిచెన్ వస్తువులు వంటివి ఇప్పుడు లభిస్తున్నాయి. తిరగడానికి వీలుగా వీల్‌చైర్, వాకర్, స్టాండింగ్ ఫ్రేమ్ వంటి పరికరాలు కూడా అందుబాట్లో ఉన్నాయి.

### ప్రత్యేక చట్టం - హక్కులు

సెరిబ్రల్ పాల్సీ, ఇతర వైకల్యం ఉన్న పిల్లలకు ఆర్‌పిడబ్ల్యుడి యాక్ట్ 2016 ప్రత్యేకమైన హక్కులు కలిగించింది. దీని ప్రకారం ... అందరితో సమానంగా కచ్చితంగా విద్య, వైద్యం, ఇతర సదుపాయాలు అందించాలి. వారిని అగౌరవపర్చటం, వేరుగా చూడటం వంటివి చేస్తే శిక్షార్హులు అవుతారు. నివాస ప్రదేశాల్లో వారిని ఖాళీ చేయమనడం, ఇల్లు అద్దెకు ఇవ్వకపోవటం వంటివి చేయరాదు. స్కూళ్లు, పెద్ద భవనాలు, ఆఫీసుల్లో వారు వీల్‌చైర్‌తో రావటానికి అనువుగా ఏర్పాటు ఉండాలి. వీల్‌చైర్ పార్కింగ్ కూడా ప్రత్యేకంగా ఉండాలి.

ప్రతి రాష్ట్రం తప్పనిసరిగా వికలాంగుల కోసం ఒక ప్రత్యేక కమిషనర్‌ను నియమించి కమిషనరేట్ ఉండాలి. ఉద్యోగాల్లో వికలాంగులకు ఇచ్చే 4 శాతం రిజర్వేషన్‌లో– ఒక శాతం సెరిబ్రల్ పాల్సీ ఉన్న వారికి కేటాయించాలి. ఎయిర్ పోర్టుల్లో, ఇతర ప్రయాణాల్లో వారిని ఇబ్బంది పెట్టడం, వీల్‌చైర్ సౌకర్యం అందించకపోవడం, ప్రయాణానికి అనుమతించకపోవడం చేస్తే శిక్షార్హులు. ఈ చట్టాన్ని పాటించని వారికి రూ.5000 నుంచి రూ.5 లక్షల వరకూ జరిమానా విధించొచ్చు.

### ప్రభుత్వ పథకాలు

సెరిబ్రల్ పాల్సీ ఉన్న పిల్లలకు ప్రభుత్వం కొన్ని పథకాలను అందిస్తోంది. చిన్న పిల్లలకు 'దిశ', స్కూల్స్‌కు వెళ్లే వారికి 'వికాస్', అనాథ పిల్లలకు 'సమర్థ్', పెద్ద వారికి 'ఘరుండా' అనే కమ్యూనిటీ ఇళ్ళు, 'నిరామయ' హెల్త్ స్కీం, డిగ్రీ, వొకేషన్ కోర్సు చదివే వారికి 'జ్ఞానప్రభ', వివిధ పరికరాలు అందించటానికి 'సంభవ్' లాంటి పథకాలు ఉన్నాయి.

సెరిబ్రల్ పాల్సీ గురించి తల్లిదండ్రులు తెలుసుకుని, నిరాశ పడకుండా టెక్నాలజీని, ప్రభుత్వం, కొన్ని స్వచ్ఛంద సంస్థలు అందించే పథకాలను వినియోగించుకునేందుకు ప్రయత్నించాలి. పిల్లలను ఇంట్లో ఉంచకుండా ప్రత్యేక పాఠశాలలకు పంపించి వారి ఎదుగుదలకు కృషి చేయాలి. మనం ఏమీ చేయకుండా ఇక ఇంతే అని నిరాశ పడొద్దు. అలాగే మన ప్రమేయం లేకుండా అద్భుతాలు జరుగుతాయని ఎదురుచూడొద్దు. మనం పట్టుదలతో, ప్రత్యేక శ్రద్ధతో నేర్పిస్తేనే పిల్లలు ఎన్నో అద్భుతాలు చేయగలరని దృఢంగా నమ్మండి. లోపాలు ఉన్నా లేకున్నా ప్రతి బిడ్డ జీవితం ముఖ్యమే! ఆ జీవితాన్ని ఆనందంగా అనుభవించే హక్కు ప్రతి బిడ్డకూ ఉంది.



డాక్టర్ దివ్య బెండి, ఎం.డి(ఆయుర్వేద)

## ఏ లక్షణాలు కనిపిస్తాయి?

సాధారణంగా ఈ సమస్య ఉన్న ఏ ఇద్దరు పిల్లలూ ఒకే రకమైన లక్షణాలు కలిగి ఉండరు. మెదడులో దెబ్బతిన్న భాగాన్ని బట్టి ఇది 3 రకాలు.

**స్పాస్టిక్ సి.పి (80–90 శాతం) :** మోటార్ కార్టెక్స్ దెబ్బతినడం వల్ల. కొంతమందికి రెండు చేతులు, రెండు కాళ్లు లేదా రెండు కాళ్లు, మరికొంత మందికి కేవలం శరీరంలో ఒక వైపు మాత్రమే ప్రభావితం అవుతుంది.

**అటాక్సిక్ సి.పి (5 శాతం) :** సెరిబెల్లం దెబ్బ తినడం వల్ల. వీరిలో కదలికలు వణుకుతున్నట్లులా ఉంటాయి. నడుస్తున్నప్పుడు బ్యాలెన్స్ చేసుకోవడానికి బాగా ఇబ్బంది పడ్తారు.

**డిస్కైనెటిక్ సి.పి (6శాతం) :** బేసల్ గాంగ్లియా దెబ్బ తినడం వల్ల. పిల్లలకు తెలియకుండా శరీర కదలికలు ఉంటాయి. కదలికలపై నియంత్రణ లేకపోవడం డ్యాన్స్ చేస్తున్నట్లు ఉంటాయి.

- ఇవే కాకుండా వినికిడి లోపం, దృష్టి సంబంధ సమస్యలు (కంటి కండరాలు దెబ్బతినడం), ఎక్కువగా సొంగ కార్చడం (బుగ్గలోని కండరాలు దెబ్బతినడం వల్ల), సరిగ్గా మింగలేక పోవడం, ఏ వస్తువూ సరిగా పట్టుకోలేకపోవడం.. వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమస్యల వల్ల నేర్చుకోవడంలో వెనుకబడతారు. తద్వారా మానసిక ఎదుగుదల లోపిస్తుంది.

**సి.పి** పిల్లలు ముందుకు వంగి నడుస్తారు. కత్తెర నడక (మోకాళ్ల దగ్గర), ముని వేళ్ల మీద నడవడం వంటివి చేస్తారు.



## చికిత్స ఏమిటి?

సెరిబ్రల్ పాల్సీకి ప్రత్యేకంగా మందులు ఏవీ ఉండవు. కానీ లక్షణాలను బట్టి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, మ్యూజిక్ థెరపీ, కండక్టివ్ ఎడ్యుకేషన్ వంటివి చేయించడం ద్వారా వారిలో మార్పులు వస్తాయి.

- కొంతమంది పిల్లల్లో కండరాలు ఎక్కువగా బిగుసుకుపోవడం వల్ల కదపలేకపోతారు. వారికి ఆపరేషన్ చేయాల్సి వుంటుంది.
- ఫిట్స్ ఉన్న పిల్లలకు న్యూరాలజిస్ట్‌ని సంప్రదించి మందులు వాడాలి.

---



## సలార్‌కు రెండు ట్రైలర్లు

ప్రభాస్ హీరోగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సలార్'. హోంబలే ఫిల్మ్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. పలు వాయిదాల తర్వాత ఈ చిత్రం తేదీని ప్రకటించారు నిర్మాతలు. డిసెంబర్ 22న ఈ చిత్రం విడుదల కానుంది. ఈనెల 23న ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా ఒక ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. నవంబర్ చివర్లో మరో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారని సమాచారం. ఈ చిత్రంలో శ్రుతిహాసన్ కథానాయిక కాగా, జగపతిబాబు, ఈశ్వరీరావు, శ్రియారెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## సంక్రాంతికి సైంధవ్

హీరో వెంకటేష్ నటిస్తున్న తాజా చిత్రం సైంధవ్. సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహాని శర్మ, ఆండ్రియా జెరెమియా, సారా, జయప్రకాష్ తదితరులు నటిస్తున్నారు. ఇది వెంకటేష్‌కి 75వ చిత్రం ఇది. శైలేష్ కొలను దర్శకత్వంలో నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందించగా, ఎస్.మణికందన్ డీవోపీగా పనిచేస్తున్నారు. గ్యారీ బిహెచ్ ఎడిటర్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్, కిషోర్ తాళ్లూరు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దక్షిణాది భాషలతో పాటు హిందీలోనూ ఈ సినిమా విడుదల కానుంది.



## 'బృందావనివే..' సాంగ్ విడుదల

హీరో ఆనంద్ దేవరకొండ 'గం..గం..గణేశ' సినిమాలో నటిస్తున్నారు. హై–లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ బొమ్మిశెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా నుంచి 'బృందావనివే..' లిరికల్ సాంగ్‌ను హీరోయిన్ రశ్మిక మందన్న గురువారం విడుదల చేశారు. 'బేబి' సినిమాలోని 'ప్రేమిస్తున్నా' పాటను గతంలో రశ్మికనే విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ సాంగ్ బిగ్ హిట్ కావాలని ఆమె ఆకాంక్షించారు. చేతన్ భరద్వాజ్ కంపోజ్ చేసిన ఈ పాటకు వెంగి సుధాకర్ సాహిత్యం అందించారు. సిద్ శ్రీరామ్‌తో కలిసి చేతన్ భరద్వాజ్ ఈ పాట పాడారు.




## 40వేల టిక్కెట్ల విక్రయంతో 'లియో'. రికార్డు

కోలీవుడ్ హీరో విజయ్ నటించిన తాజా సినిమా 'లియో'. లోకేశ్ కనగరాజ్ దర్శకుడు. ఈ చిత్రం ఈనెల 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదలకు ముందే ఈ సినిమా రికార్డును సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ట్వీట్ చేసింది. విజయ్‌కు విదేశాల్లోనూ భారీగా అభిమానులున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓవర్సీస్‌లో ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఇప్పటి వరకు 40 వేల టిక్కెట్లు అమ్ముడయ్యాయి. ఇంకా థియేటర్ల సంఖ్య పెంచుతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఇంత వరకు ఏ భారతీయ సినిమాకు ఈ స్థాయిలో టికెట్లు అమ్ముడుపోలేదని యూకేకు చెందిన నిర్మాణ సంస్థ తెలిపింది. ట్రైలర్ కూడా రిలీజ్ చేయకుండానే ఇంత భారీ మొత్తంలో టికెట్లు సేల్ అవ్వడం రికార్డని పేర్కొంది. విడుదల ముందు నాటికి ఈ సంఖ్య 50 వేలకు చేరుతుందని నిర్మాణ సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది.



## మోసగాళ్లతో జాగ్రత్త : బ్రహ్మాజీ



సినిమాపై ఆసక్తితో పరిశ్రమకు వచ్చి అవకాశాల వేటలో ఉన్న ఆర్టిస్టలను లక్ష్యం చేసుకుని జరుగుతున్న మోసాలపై నటుడు బ్రహ్మాజీ ట్వీట్లు చేశారు. తాము స్టార్ దర్శకుల వద్ద పని చేస్తున్నామంటూ కొందరు వ్యక్తులు యువ నటులకు మెసేజ్‌లు పంపిస్తున్నారని, ఆ వంకతో డబ్బు గుంజాలని చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో తస్మాత జాగ్రత్త అని బ్రహ్మజి సూచించారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్‌లో ఓ పోస్ట్ పెట్టారు. 'నటరాజ్ అన్నాదొరై అనే వ్యక్తి.. దర్శకుడు లోకేశ్ కనగరాజ్ మేనేజర్‌నని చెబుతూ పలువురు యువతీ యువకులకు మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ చేస్తున్నాడు. లోకేశ్ తెరకెక్కించే తదుపరి చిత్రానికి వారి ప్రొఫైల్ ఎంపికైందని.. డబ్బులిస్తే ఆడిషన్‌కు అవసరమైన కాస్ట్యూమ్స్ తాను రెంట్‌కు తీసుకువస్తానని.. ఆడిషన్ పూర్తయ్యాక ఆ డబ్బులు వాపస్ ఇచ్చేస్తానని నమ్మిస్తున్నాడు. అలాగే సత్యదేవ్ అనే మరో వ్యక్తి తాను ఫోర్బ్స్ మ్యాగజైన్ జర్నలిస్ట్‌నని చెబుతూ డబ్బులు గుంజడానికి ప్రయత్నిస్తున్నాడు. సినీ పరిశ్రమలోకి రావాలని కలలుకనే కొత్తతరం నటులను టార్గెట్‌గా చేసుకుని వీళ్లు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారు. ఈ విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండండి' అని బ్రహ్మాజీ వరుసగా ట్వీట్లు చేశారు.

---

కాంపౌండ్ టీమ్ విభాగంలో

## జ్యోతి సురేఖ బృందానికి స్వర్ణం

- పురుషుల ఆర్చరీ జట్టుకు స్క్వాష్ జోడీలకు బంగారు పతకాలు
- 12వ రోజు భారత్ ఖాతాలో మరో ఐదు పతకాలు



ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో పసిడి సాధించిన మహిళల, పురుషుల బృందం




స్క్వాష్‌లో స్వర్ణం నెగ్గిన దీపిక పల్లికల్, హరీందర్ పాల్



వ్యక్తిగత విభాగంలో సౌరవ్ ఘోషల్‌కు రజత పతకం

**హాంగ్జు:** ఆసియా క్రీడల్లో భారత్‌కు మూడు స్వర్ణ, ఒక్కో రజత, కాంస్య పతకాలు దక్కాయి. ఆర్చరీ కాంపౌండ్ పురుషుల, మహిళల విభాగాలతోపాటు, స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకాలు లభించాయి. ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్ వెన్నం జ్యోతి సురేఖ, ప్రవీణ్ ఓజాస్ జంట ఇప్పటికే స్వర్ణ పతకం సాధించగా.. తాజాగా మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలోనూ జ్యోతి సురేఖ మరో స్వర్ణ పతకం సాధించడంలో కీలకపాత్ర పోషించింది. కాంపౌండ్ టీమ్ ఫైనల్లో జ్యోతి సురేఖ, అదితి గోపిచంద్, పర్ణీత్ కౌర్‌తో కూడిన మహిళల జట్టు 230–229పాయింట్ల తేడాతో చైనీస్ తైపీపై విజయం సాధించింది. ఇక అభిషేక్ వర్మ, ప్రవీణ్ ఓజాస్, ప్రథ్మేష్‌లతో కూడిన పురుషుల జట్టు ఫైనల్లో 235–230పాయింట్ల తేడాతో కొరియాపై గెలిచి పసిడిను ముద్దాడారు. అంతకుముందు వీరు సెమీస్‌లో 235–224 పాయింట్ల తేడాతో చైనీస్ తైపీపై నెగ్గి ఫైనల్లోకి దూసుకొచ్చారు. అలాగే స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్‌లో దీపిక పల్లికల్, హరీందర్ పాల్ సింగ్ 11–10, 11–10తో మలేషియాకు చెందిన ఐఫా బింతీ, మహ్మద్ షఫీక్ బిన్‌పై కేవలం 35నిమిషాల్లోనే విజయం సాధించింది పసిడిని సాధించారు.

స్క్వాష్ వ్యక్తిగత విభాగంలో సౌరవ్ గోశల్ రజత పతకాన్ని సాధించాడు. మలేషియాకు చెందిన ఇయాన్ యోవ్‌తో జరిగిన ఫైనల్లో సౌరవ్ పోరాడి ఓడాడు. తొలి గేమ్‌ను 11–9తో నెగ్గిన సౌరవ్.. రెండో గేమ్‌లో 9–11తో ఓడాడు. మూడో గేమ్‌ను 5–11తో, నాల్గో గేమ్‌ను 7–11తో ఓడాడు. దీంతో సౌరవ్ రజత పతకానికే పరిమితమయ్యాడు. ఇక మహిళల 53కిలోల రెజ్లింగ్‌లో అంతిమ్ కాంస్య పతకం సాధించింది. గురువారం జరిగిన కాంస్య పతక పోటీలో అంతిమ్ 11–0పాయింట్ల తేడాతో టెక్నికల్ సుపీరియారిటీలో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జాస్మినాపై విజయం సాధించింది. రెజ్లింగ్‌లో భారత్‌కు దక్కిన రెండో పతకం ఇదే. దీంతో 12వ రోజు ఆసియా క్రీడలు ముగిసే సరికి భారత్ 21బంగారు, 32 రజత, 33 కాంస్యాలతో సహ మొత్తం 86 పతకాలతో నాల్గోస్థానంలో కొనసాగుతోంది.



రెజ్లింగ్‌లో అంతిమ్‌కు కాంస్యం

### మహిళల హాకీ సెమీస్‌లో ఓటమి

మహిళల హాకీలో భారతజట్టు సెమీస్‌లో ఓటమిపాలైంది. గురువారం జరిగిన సెమీస్ పోటీలో భారత్ 0–4గోల్స్ తేడాతో ఆతిథ్య చైనా చేతిలో పరాజయాన్ని చవిచూసింది. దీంతో ఆసియా క్రీడల్లో వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరాలన్న టీమిండియా ఆశలు అడియాశలయ్యాయి. 2018లో జకార్తా ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీజట్టు ఫైనల్‌కు చేరి జపాన్ చేతిలో ఓడి రజత పతకానికే పరిమితమైంది. 1982నుంచి భారత మహిళల జట్టు బంగారు పతకాన్ని సాధించలేకపోయింది. దీంతో భారత జట్టు కాంస్య పతకం 7న జపాన్–దక్షిణ కొరియా మ్యాచ్ పరాజితతో తలపడనుంది. లీగ్‌లో మహిళల జట్టు తొలిమ్యాచ్‌లో సింగపూర్‌ను 13–0 గోల్స్‌తో ఓడించింది. ఆ తర్వాత మలేషియాపై 6–0తో గెలుపొందింది. దక్షిణ కొరియాతో జరిగిన మూడో మ్యాచ్ 1–1తో డ్రాగా ముగిసింది. హాంకాంగ్‌పై 13–0తో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్‌లో ఓమిటి లేకుండా అద్భుత ప్రదర్శన చేసిన టీమిండియా.. సెమీఫైనల్‌లో చైనాతో మ్యాచ్‌లో మాత్రం తడబడింది.

---

## న్యూజిలాండ్ బోణి

ఇంగ్లండ్‌పై 9వికెట్ల తేడాతో గెలుపు
కాన్వే, రవీంద్ర అజేయ సెంచరీలు

**అహ్మదాబాద్:** ఐసిసి వన్డే ప్రపంచకప్ న్యూజిలాండ్ బోణీ కొట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్ నిర్దేశించిన 283పరుగుల లక్ష్యాన్ని కేవలం యంగ్(0) వికెట్ కోల్పోయి ఛేదించింది. కాన్వే(152నాటౌట్; 121బంతుల్లో 19ఫోర్లు, 3సిక్సర్లు), రచిన్ రవీంద్ర(123నాటౌట్; 96బంతుల్లో 11ఫోర్లు, 5సిక్సర్లు) 2వ వికెట్‌కు 273పరుగులు జతచేసి న్యూజిలాండ్‌కు విజయాన్నందించారు. అంతకుముందు టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. జో రూట్ (77; 86బంతుల్లో 4ఫోర్లు, సిక్సర్) అర్ధ శతకానికి తోడు జోస్ బట్లర్ (43; 42బంతుల్లో 2 ఫోర్లు, 2సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించాడు. హెన్రీకి మూడు, సాంట్నర్, ఫిలిప్స్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.



కాన్వే, రవీంద్ర 273పరుగుల భాగస్వామ్యం వన్డే ప్రపంచకప్‌లో నాల్గో అత్యధిక భాగస్వామ్యం ఇదే!

వన్డే ప్రపంచకప్‌లో నేడు..
**పాకిస్తాన్ × నెదర్లాండ్స్**
(వేదిక: హైదరాబాద్, మ.2.00గం॥లకు)

### పతకాల పట్టిక

| వ.స. | దేశం | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1. | చైనా | 179 | 99 | 55 | 333 |
| 2. | జపాన్ | 44 | 54 | 60 | 158 |
| 3. | ద.కొరియా | 33 | 47 | 77 | 157 |
| 4. | ఇండియా | 21 | 32 | 33 | 86 |
| 6. | ఉజ్బెకిస్తాన్ | 19 | 16 | 25 | 60 |
| 5. | చైనీస్ తైపీ | 15 | 15 | 23 | 53 |
| 9. | ఉ.కొరియా | 10 | 16 | 9 | 35 |
| 7. | థాయ్‌లాండ్ | 10 | 14 | 27 | 51 |
| 10. | బహ్రెయిన్ | 10 | 2 | 5 | 17 |
| 10 | ఇరాన్ | 8 | 17 | 17 | 42 |

స్వ:స్వర్ణాలు; ర:రజితం; కా:కాంస్యం మొ:మొత్తం

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68